

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శుక్రవారం 10-10-2025 | సంపుటి - 25 | సంచిక -146 | రూ : 4 | పేజీలు: 8




2లో

## ఐరాస భద్రతామండలిలో భారత్ స్థానం పొందాలి

- ఐరాస భద్రతా మండలిలో భారత్‌కు శాశ్వత సభ్యత్వంపై యూకే మద్దతు
- భారత్‌కు దాని సరైన స్థానం దక్కాలని వ్యాఖ్యానించిన ప్రధాని కీర్ స్టార్మర్
- ప్రధాని మోదీతో భేటీ అనంతరం కీలక ప్రకటన చేసిన బ్రిటన్ ప్రధాని
- గత పదేళ్లలో అతిపెద్ద వాణిజ్య బృందంతో భారత్‌కు వచ్చినట్లు వెల్లడి
- యూకేలో బాలీవుడ్ చిత్రాల నిర్మాణానికి ఒప్పందం కుదిరినట్లు ప్రకటన
- గాజా శాంతి ఒప్పందంపై హర్షం వ్యక్తం చేసిన స్టార్మర్

## సాహిత్యంలో హంగేరియన్ రచయితకు నోబెల్ ప్రైజ్



2లో

- 2025 సంవత్సరానికి సాహిత్య నోబెల్ బహుమతి ప్రకటన
- హంగేరియన్ రచయిత లాస్లో క్రాస్నహోర్కైకి పురస్కారం
- ఆయన దార్శనిక రచనలకు దక్కిన అరుదైన గౌరవం
- భయానక పరిస్థితుల్లోనూ కళా శక్తిని చాటారన్న నోబెల్ కమిటీ
- ప్రపంచ సాహిత్యంలో అత్యున్నత పురస్కారంగా గుర్తింపు



2లో

## చదువుకున్న ముస్లిం మహిళలే టార్గెట్..

### జైషే మహమ్మద్ సరికొత్త ఎత్తుగడ!

- జైషే మహమ్మద్ ఉగ్రవాద సంస్థ సరికొత్త నియామక వ్యూహం
- విద్యావంతులైన ముస్లిం మహిళలే ప్రధాన లక్ష్యం
- మతపరమైన ప్రసంగాలతో భావోద్వేగాలను రెచ్చగొట్టి బ్రెయిన్‌వాష్
- వాట్సాప్, టెలిగ్రామ్ ద్వారా విస్తృతంగా ఉగ్ర ప్రచారం
- భారత దాడుల తర్వాత పాక్-ఆఫ్ఘన్ సరిహద్దుకు ఉగ్ర స్థావరాల మార్పు

### బీసీలకు రిజర్వేషన్లపై హైకోర్టు తీర్పు కాపీ రాగానే

## సుప్రీంకు వెళ్లే యోచనలో రేవంత్ సర్కారు

- స్థానిక సంస్థల్లో బీసీలకు 42% రిజర్వేషన్లపై హైకోర్టు స్టే
- రిజర్వేషన్లు ఇచ్చి తీరతామని స్పష్టం చేసిన మంత్రి శ్రీహరి
- బీఆర్ఎస్, బీజేపీ కుమ్మక్కై అడ్డుకుంటున్నాయని ఆరోపణ
- బీసీలు నిరాశ చెందవద్దని మంత్రి భరోసా



2లో



### స్థానిక ఎన్నికలు ఇజ్జత్ కా సవాల్..

## గెలిస్తేనే పలుకుబడి

: బండి సంజయ్

- స్థానిక సంస్థల ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలన్న బండి

2లో

## రైతుకు ధర దక్కాలి... వినియోగదారుడికి ధర తగ్గాలి..

### ఇదే మన లక్ష్యం: సీఎం చంద్రబాబు



2లో

### శత్రు డ్రోన్లను వెతికి వేటాడే...

## ‘సాక్షమ్’



2లో

- శత్రు డ్రోన్ల వేటకు భారత సైన్యం కొత్త అస్త్రం
- ‘సాక్షమ్’ పేరుతో కౌంటర్ డ్రోన్ వ్యవస్థ కొనుగోలు
- పూర్తిగా దేశీయ పరిజ్ఞానంతో భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ రూపకల్పన
- ఆపరేషన్ సిందూర్ తర్వాత కీలక నిర్ణయం
- 3000 మీటర్ల ఎత్తు వరకు గగనతలంలో పూర్తి రక్షణ
- ఏడాదిలోగా దళాలకు అందజేయాలని లక్ష్యం



2లో

### అమెరికా విధానాలు

## ఆర్థిక వృద్ధికి దోహదపడాలి

- ఇటీవల కఠిన నిబంధనలతో ఆందోళన
- ఇలాంటి నిర్ణయాలు అస్థిరతకు, అపార్థాలకు దారితీస్తాయి
- ఆ దేశ ప్రతినిధులతో భేటీలో సీఎం రేవంత్‌రెడ్డి



# శత్రు డ్రోన్లను వెతికి వేటాడే... 'సాక్షమ్'

ఢిల్లీ, అక్టోబర్ 09 : సరిహద్దుల్లో శత్రు దేశాల నుంచి డ్రోన్ల ముప్పు పెరుగుతున్న నేపథ్యంలో, వాటిని సమర్థంగా ఎదుర్కొనేందుకు భారత సైన్యం కీలక చర్యలు చేపట్టింది. పూర్తిగా దేశీయ పరిజ్ఞానంతో అభివృద్ధి చేసిన 'సాక్షమ్' అనే అత్యాధునిక కౌంటర్ డ్రోన్ వ్యవస్థను కొనుగోలు చేసే ప్రక్రియను ప్రారంభించింది. 'ఆత్మనిర్భర్ భారత్' స్ఫూర్తితో ఘజియాబాద్‌లోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ ఈ వ్యవస్థను రూపొందించింది. ఇటీవల జరిగిన 'ఆపరేషన్ సిందూర్' సమయంలో పాకిస్థాన్ ప్రయోగించిన దాదాపు 400 డ్రోన్లను భారత భద్రతా దళాలు విజయవంతంగా నిర్వీర్యం చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటన తర్వాత, డ్రోన్లను ఎదుర్కోవడానికి ఒక పటిష్టమైన వ్యవస్థ అవసరాన్ని సైన్యం గుర్తించింది. ఈ నేపథ్యంలోనే 'సాక్షమ్' కొనుగోలుకు ఫాస్ట్ ట్రాక్ ప్రొక్యూర్‌మెంట్ (FTP) విధానంలో ఆమోదం తెలిపింది. రాబోయే ఏడాదిలోగా ఈ వ్యవస్థను అన్ని సైనిక క్షేత్రాలకు అందించాలని లక్ష్యంగా పెట్టుకుంది. గతంలో సైన్యం కేవలం భూభాగంపైనే దృష్టి సారించేది. కానీ ఆధునిక యుద్ధ తంత్రంలో భాగంగా, భూమికి 3,000 మీటర్ల (10,000 అడుగుల) ఎత్తు వరకు ఉన్న గగనతలాన్ని కూడా 'వ్యూహాత్మక యుద్ధ క్షేత్రం'గా పరిగణిస్తున్నారు. ఈ ప్రాంతంలో శత్రు డ్రోన్లు, విమానాలను గుర్తించి, వాటిని నాశనం చేస్తూనే.. మన వైమానిక దళాలకు ఎలాంటి ఆటంకం లేకుండా చూడటమే 'సాక్షమ్' ప్రధాన లక్ష్యమని రక్షణ శాఖ అధికారులు వివరించారు. 'సాక్షమ్' వ్యవస్థ ఒక మాడ్యులర్ కమాండ్ అండ్ కంట్రోల్ సిస్టమ్‌గా పనిచేస్తుంది. ఇది శత్రు డ్రోన్లను నిజ సమయంలో గుర్తించడం, ట్రాక్ చేయడం, వాటిని నిర్వీర్యం చేయడం వంటి పనులను చేస్తుంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారంగా పనిచేసే ఈ వ్యవస్థ, ముప్పును ముందుగానే పసిగట్టి కమాండర్లకు వేగంగా నిర్ణయాలు తీసుకునేందుకు సహకరిస్తుంది. సెన్సార్లు, సాఫ్ట్‌కిల్, హార్డ్‌కిల్ ఆయుధ వ్యవస్థలను ఒకే గొడుగు కిందకు తెచ్చి, గగనతలంలో పూర్తిస్థాయి భద్రతను అందిస్తుంది. రష్యా-ఉక్రెయిన్, ఇజ్రాయెల్-పాలస్తీనా వంటి ఆధునిక యుద్ధాల్లో డ్రోన్ల పాత్ర పెరిగిన తరుణంలో, భారత సైన్యం ఈ వ్యవస్థను సమకూర్చుకోవడం వ్యూహాత్మకంగా ఎంతో కీలకమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## సాహిత్యంలో హంగేరియన్ రచయితకు నోబెల్ ప్రైజ్

నోయిడా, అక్టోబర్ 9 : సాహిత్య రంగంలో ఈ ఏడాది నోబెల్ బహుమతి హంగేరియన్ రచయిత లాస్లో క్రాస్నహోర్కైని వరించింది. ఆయన విలక్షణమైన, దార్శనిక రచనలకు ఈ అత్యున్నత పురస్కారం దక్కినట్లు స్వీడిష్ అకాడమీ గురువారం అధికారికంగా ప్రకటించింది. ప్రపంచ వినాశనం వంటి తీవ్ర భయానక పరిస్థితుల మధ్య కూడా కళకు ఉన్న అపారమైన శక్తిని తన రచనల ద్వారా బలంగా చాటి చెప్పినందుకు గాను లాస్లోకు ఈ గౌరవం అందిస్తున్నట్లు నోబెల్ కమిటీ తన ప్రకటనలో పేర్కొంది. ఆయన సాహిత్యం సమకాలీన ప్రపంచంలోని సంక్లిష్టతలను, మానవ అస్తిత్వ వేదనను వినూత్న శైలిలో ఆవిష్కరిస్తుందని ప్రశంసించింది. లాస్లో క్రాస్నహోర్కై తన రచనలతో ఆధునిక సాహిత్యంలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. ఇప్పుడు నోబెల్ బహుమతితో ఆయన కీర్తి విశ్వవ్యాప్తమైంది.

## బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై హైకోర్టు తీర్పు కాపీ రాగానే
## సుప్రీంకు వెళ్లే యోచనలో రేవంత్ సర్కారు

హైదరాబాద్, అక్టోబర్ 09 : స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన తరగతులకు (బీసీలకు) 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్9పై హైకోర్టు స్టే విధించడం తెలిసిందే. అయితే, ఈ విషయంలో వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని, బీసీలకు ఇచ్చిన మాట ప్రకారం 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసి తీరతామని రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు. హైకోర్టు తీర్పుతో బీసీ వర్గాలు ఏమాత్రం నిరాశ చెందవద్దని, ప్రభుత్వం వారికి అండగా నిలుస్తుందని ఆయన భరోసా ఇచ్చారు. ఈ అంశంపై న్యాయపరంగా పోరాడేందుకు సిద్ధంగా ఉన్నామని తేల్చి చెప్పారు. గురువారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి శ్రీహరి మాట్లాడారు. స్థానిక సంస్థల్లో బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం పెంచాలనే సదుద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తమ ప్రభుత్వం ఈ చారిత్రక నిర్ణయం తీసుకుందని గుర్తుచేశారు. అయితే, ప్రతిపక్షాలు దీన్ని అడ్డుకునేందుకు కుట్రలు చేస్తున్నాయని ఆయన తీవ్రస్థాయిలో ఆరోపించారు. "ఈ కేసు వేసింది బీఆర్ఎస్ పార్టీనే. బీసీలకు న్యాయం జరగకుండా అడ్డుకోవాలనే దురుద్దేశంతో బీజేపీతో కలిసి బీఆర్ఎస్ ఈ కుట్రకు పాల్పడింది" అని ఆయన విమర్శించారు. ప్రభుత్వం తరఫున హైకోర్టులో బలమైన వాదనలు వినిపించినప్పటికీ, స్టే రావడం దురదృష్టకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తదుపరి అనుసరించబోయే వ్యూహంపై మంత్రి శ్రీహరి స్పష్టతనిచ్చారు. హైకోర్టు జారీ చేసిన తీర్పు పూర్తి కాపీ చేతికి అందిన వెంటనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఉన్నతస్థాయిలో సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు. న్యాయనిపుణులతో సంప్రదింపులు జరిపిన అనంతరం, హైకోర్టు తీర్పును సుప్రీం కోర్టులో సవాలు చేయాలా లేదా ఇతర న్యాయపరమైన చర్యలు చేపట్టాలా అనే విషయంపై తుది నిర్ణయం తీసుకుంటామని వివరించారు. బీసీల సామాజిక న్యాయం కోసం ఎంతవరకైనా పోరాడతామని, ఈ రిజర్వేషన్ల అమలు తమ ప్రభుత్వ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు. మరోవైపు, జీవో 9పై హైకోర్టు స్టే విధించడం రాష్ట్రవ్యాప్తంగా బీసీ సంఘాల్లో ఆందోళనను రేకెత్తించింది. ఈ పరిణామం స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ ఆలస్యం కావడానికి కారణమవుతుందేమోననే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం దీనిని సామాజిక న్యాయానికి సంబంధించిన అంశంగా భావిస్తుండగా, ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీలు మాత్రం ప్రభుత్వ నిర్ణయాన్ని మొదటి నుంచి విమర్శిస్తున్నాయి. ఈ నేపథ్యంలో, ప్రభుత్వం తీసుకోబోయే తదుపరి అడుగుపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. బీసీ సంఘాలు మాత్రం ప్రభుత్వానికి మద్దతుగా నిలుస్తూ, రిజర్వేషన్ల అమలు ప్రక్రియను వేగవంతం చేయాలని కోరుతున్నాయి.

## చదువుకున్న ముస్లిం మహిళలే టార్గెట్..
## జైషే మహమ్మద్ సరికొత్త ఎత్తుగడ!

పాకిస్తాన్, అక్టోబర్ 09 : పాకిస్థాన్ కేంద్రంగా పనిచేసే జైషే మహమ్మద్ ఉగ్రవాద సంస్థ తన కార్యకలాపాలను విస్తరించేందుకు సరికొత్త, ప్రమాదకరమైన కుట్రకు తెరలేపింది. ఇప్పటివరకు యువకులనే లక్ష్యంగా చేసుకున్న ఈ సంస్థ.. తాజాగా విద్యావంతులైన ముస్లిం మహిళలను ఉగ్రవాదం వైపు ఆకర్షించేందుకు ప్రయత్నిస్తోందని భారత నిఘా వర్గాలు సంచలన విషయాలు వెల్లడించాయి. మతపరమైన ప్రసంగాలు, భావోద్వేగపూరిత సందేశాలతో వారిని బ్రెయిన్‌వాష్ చేసి తమ నెట్‌వర్క్‌లో చేర్చుకోవడానికి పక్కా ప్రణాళికతో ముందుకెళుతున్నట్లు గుర్తించాయి. జైషే మహమ్మద్‌కు అనుబంధంగా పనిచేసే 'జమాతుల్ ముమినాత్' అనే సంస్థ ఈ నియామకాల్లో కీలక పాత్ర పోషిస్తున్నట్లు నిఘా వర్గాలు తెలిపాయి. ఈ సంస్థ 2004 నుంచే చురుకుగా ఉన్నప్పటికీ, ఇటీవల తన కార్యకలాపాలను ముమ్మరం చేసింది. ముఖ్యంగా జమ్మూ కశ్మీర్, ఉత్తరప్రదేశ్, దక్షిణ భారతదేశంలోని పట్టణ ప్రాంతాల్లో నివసించే చదువుకున్న మహిళలను లక్ష్యంగా చేసుకుంది. వాట్సాప్, టెలిగ్రామ్ వంటి సోషల్ మీడియా వేదికలతో పాటు మదర్సాల నెట్‌వర్క్‌ను ఉపయోగించుకుని చిన్న చిన్న గ్రూపులుగా ఏర్పడి ప్రచారం నిర్వహిస్తోంది. ఉర్దూ భాషలో ముద్రించిన ప్రచార సామగ్రిలో మక్కా, మదీనా చిత్రాలు, ఖురాన్‌లోని శ్లోకాలను వాడుతూ మహిళలను ఆకర్షిస్తున్నారు. "ఈ వ్యవస్థ అల్లాహ్ ఇచ్చింది", "ఈ వెలుగు ప్రపంచమంతా వ్యాపిస్తుంది" వంటి భావోద్వేగ నినాదాలతో వారిని ప్రలోభాలకు గురిచేస్తున్నారని నిఘా వర్గాలు పేర్కొన్నాయి. హిజాబ్ ధరించడం, ప్రార్థనలు చేయడం ద్వారానే మతానికి సేవ చేసినట్లు అవుతుందని నమ్మించి, వారిని ఉగ్ర కార్యకలాపాల వైపు మళ్లిస్తున్నట్లు తేలింది. గతంలో భారత సైన్యం నిర్వహించిన 'ఆపరేషన్ సిందూర్' సమయంలో పాక్ ఆక్రమిత కశ్మీర్, పంజాబ్ ప్రావిన్సులలో జైషే మహమ్మద్, హిజ్బుల్ ముజాహిదీన్‌లకు చెందిన తొమ్మిది ప్రధాన ఉగ్రవాద శిబిరాలను మన బలగాలు ధ్వంసం చేశాయి. ఈ దాడుల తర్వాత ఉగ్ర సంస్థలు తమ వ్యూహాన్ని మార్చుకున్నాయి.

## రైతుకు ధర దక్కాలి... వినియోగదారుడికి ధర తగ్గాలి... ఇదే మన లక్ష్యం

అమరావతి, అక్టోబర్ 09 :"రైతు పండించిన పంటకు సరైన ధర దక్కాలి, అదే సమయంలో ఆ పంటను కొనుగోలు చేసే వినియోగదారుడిపై అధిక భారం పడకూడదు. ఈ రెండింటినీ సమన్వయం చేయడమే మన ప్రభుత్వ ప్రధాన లక్ష్యం" అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. వ్యవసాయ, మార్కెటింగ్ శాఖలు ఈ దిశగా కలిసి పనిచేసి, రైతులు, ప్రజలకు మధ్య వారధిగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు. నేడు సచివాలయంలో వ్యవసాయ, అనుబంధ రంగాలపై ముఖ్యమంత్రి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి మంత్రి అచ్చెన్నాయుడు, పలు కార్పొరేషన్ల ఛైర్మన్లు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ రంగాన్ని లాభసాటిగా మార్చేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సీఎం కీలక ఆదేశాలు జారీ చేశారు.

*** మార్కెట్ యార్డుల ఆధునికీకరణకు మాస్టర్ ప్లాన్**

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 218 వ్యవసాయ మార్కెట్ కమిటీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు సమగ్రమైన మాస్టర్ ప్లాన్ సిద్ధం చేయాలని చంద్రబాబు అధికారులను ఆదేశించారు. మార్కెట్ యార్డుల పరిధిలోని ఖాళీ స్థలాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. "మార్కెట్ యార్డుల్లో కోల్డ్ చైన్ వ్యవస్థలు, అగ్రి ప్రాసెసింగ్ యూనిట్లు వంటివి ఏర్పాటు చేయాలి. దీనివల్ల పంట నిల్వ సామర్థ్యం పెరిగి, రైతులకు మెరుగైన ధర లభిస్తుంది" అని ఆయన పేర్కొన్నారు. రైతు బజార్లను పూర్తిస్థాయిలో ఆధునికీకరించాలని, పట్టణ ప్రాంతాల్లో అవసరమైన భూమిని అంచనా వేయాలని చెప్పారు. రైతు బజార్లకు అనుసంధానంగా మొబైల్ రైతు బజార్లను ఏర్పాటు చేసే ఆలోచనను పరిశీలించాలని తెలిపారు. నిధుల సమీకరణ కోసం మార్కెట్ కమిటీలు, రైతు బజార్లను కలిపి ఒక కార్పొరేషన్‌గా ఏర్పాటు చేయాలని సూచించారు. ఇటీవల పత్తికొండలో టమాటో ధరలు పడిపోయిన విషయాన్ని ప్రస్తావిస్తూ, అలాంటి పరిస్థితుల్లో పంటను నేరుగా రైతు బజార్లకు తరలించి ప్రజలకు అందుబాటు ధరలకు అందించే ఏర్పాట్లు చేయాలన్నారు.

*** రసాయనాలకు చెక్.. సేంద్రియ సాగుకు జై**

రసాయన ఎరువులు, పురుగుమందుల మితిమీరిన వాడకంపై సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. "ఎక్కువ యూరియా వేస్తే ఎక్కువ దిగుబడి వస్తుందనే అపోహతో రైతులు భూసారాన్ని దెబ్బతీస్తున్నారు. ఈ ఉత్పత్తుల వల్ల ప్రజల ఆరోగ్యం కూడా పాడవుతోంది. ఈ విధానానికి స్వస్తి పలకాలి" అని అన్నారు. 2026 ఖరీఫ్ నాటికి సేంద్రీయ సాగును గణనీయంగా పెంచేలా, రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించేలా రైతుల్లో విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు. భూసారాన్ని పెంచే పోషకాలపై దృష్టి సారించి, ప్రకృతి సేద్యం వల్ల కలిగే ఆర్థిక, ఆరోగ్య ప్రయోజనాలను రైతులకు వివరించాలని చెప్పారు. రైతులకు అన్ని రకాల సేవలు అందించేలా రైతు సేవా కేంద్రాలను పునర్వ్యవస్థీకరించాలని తెలిపారు.

*** రబీకి పక్కా ప్రణాళిక.. ఎరువుల పంపిణీపై కఠిన వైఖరి**

రబీ సీజన్‌కు ఎరువుల కొరత లేకుండా చూడాలని, పంపిణీలో పారదర్శకత పాటించాలని సీఎం స్పష్టం చేశారు. అధికారులు రబీకి 23 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని వివరించారు. దీనిపై సీఎం స్పందిస్తూ, "భూసార పరీక్షల నివేదికల ఆధారంగా రైతులకు ఎంత ఎరువు అవసరమో నిర్దేశించాలి. సాగు విస్తీర్ణాన్ని బట్టి సరఫరా జరగాలి. ఆధార్ ఆధారితంగానే యూరియా పంపిణీ చేసి, అక్రమ రవాణాను అరికట్టాలి. ప్రతి రైతు, కౌలు రైతుకు ఎంత యూరియా ఇచ్చారనే దానిపై పక్కా రికార్డులు నిర్వహించాలి" అని కఠిన ఆదేశాలు జారీ చేశారు. ఈ ఏడాది ధాన్యం సేకరణ లక్ష్యం గత ఏడాదితో పోలిస్తే 44 శాతం అధికంగా 51 లక్షల మెట్రిక్ టన్నులుగా నిర్దేశించినట్లు అధికారులు తెలపగా, రైతులకు టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని సీఎం సూచించారు.

*** ప్రత్యామ్నాయ పంటలు.. అనుబంధ రంగాలపై దృష్టి**

ఈ సమీక్షలో, ప్రధాని ప్రారంభించనున్న 'పీఎం ధన్ ధాన్య కృషి యోజన'పై కూడా చర్చించారు. ఈ పథకం ద్వారా రైతులకు కలిగే ప్రయోజనాలను అధ్యయనం చేయాలని సీఎం సూచించారు. సెరీకల్చర్ (పట్టు పరిశ్రమ) రంగంలో కర్ణాటకతో పోలిస్తే ఏపీ వెనుకబడి ఉండటంపై విశ్లేషణ చేయాలన్నారు. పట్టు ఉత్పత్తి యంత్రాలను ఎంఎస్ఎంఈల ద్వారా సబ్సిడీపై అందించాలని, ఈ రంగంలో బిల్ గేట్స్ ఫౌండేషన్ సహకారం కూడా తీసుకోవాలని చెప్పారు. ఉల్లి, టమాటో, మిర్చి వంటి పంటల విషయంలో ధరలు పడిపోకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో జీలుగు బెల్లం, వెదురు ఉత్పత్తులను అరకు కాఫీ తరహాలో ప్రోత్సహించాలని, పుట్టగొడుగుల సాగును ప్రోత్సహించాలని తెలిపారు. ఈ సందర్భంగా 202526 ఆర్థిక సంవత్సరానికి వివిధ పంటల మద్దతు ధరల పోస్టర్‌ను ముఖ్యమంత్రి విడుదల చేశారు.

## స్థానిక ఎన్నికలు ఇజ్జత్ కా సవాల్..
## గెలిస్తేనే పలుకుబడి

హైదరాబాద్, అక్టోబర్ 09 : స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న వేళ కేంద్ర మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ సొంత పార్టీ నేతలకు తీవ్ర స్థాయిలో హెచ్చరికలు జారీ చేశారు. పార్టీ అధికారికంగా ప్రకటించిన అభ్యర్థికి వ్యతిరేకంగా పనిచేయడం కన్నతల్లికి ద్రోహం చేయడంతో సమానమని, అంతకంటే నీచమైన పని మరొకటి ఉండదని సంచలన వ్యాఖ్యలు చేశారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలోని బూత్ స్థాయి అధ్యక్షులు, ఇతర ముఖ్య నాయకులతో ఈరోజు ఆయన టెలికాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ, "నాకు ఎలాంటి గ్రూపులూ లేవు, బీజేపీయే నా గ్రూప్. పార్టీ నిర్ణయించిన అభ్యర్థి గెలుపు కోసమే ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలి" అని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలను బూత్ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి నాయకుడి వరకు ప్రతి ఒక్కరూ ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. నాయకులు తమ సొంత గ్రామాల్లో, మండలాల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించుకుంటేనే వారికి గౌరవం, పలుకుబడి ఉంటాయని తేల్చిచెప్పారు. అభ్యర్థుల ఎంపికపై మాట్లాడుతూ, "గెలుపు అవకాశాలే ప్రామాణికంగా సర్వే నివేదికల ఆధారంగా రాష్ట్ర నాయకత్వమే అభ్యర్థులను ప్రకటిస్తుంది. ఈ విషయంలో నా అభిప్రాయం మాత్రమే అంతిమం కాదు" అని స్పష్టం చేశారు. హైకోర్టు తీర్పు ఎలా ఉన్నప్పటికీ, ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని, టిక్కెట్లు ఆశించే వారు నామినేషన్ పత్రాలను సిద్ధం చేసుకోవాలని సూచించారు.

## ఐరాస భద్రతామండలిలో భారత్ స్థానం పొందాలి: బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్

ఢిల్లీ, అక్టోబర్ 09 : ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో భారత్‌కు శాశ్వత సభ్యత్వం దక్కాలన్న వాదనకు బ్రిటన్ నుంచి బలమైన మద్దతు లభించింది. ప్రపంచ వేదికపై భారత్ తన 'సరైన స్థానాన్ని' పొందాలని యూకే ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ గురువారం స్పష్టం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో ఢిల్లీలోని రాజ్‌భవన్‌లో సమావేశమైన అనంతరం ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్ సాధిస్తున్న అద్భుతమైన అభివృద్ధిని, అంతర్జాతీయ వ్యవహారాల్లో కీలక పాత్ర పోషించగల సామర్థ్యాన్ని స్టార్మర్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. "భద్రతా మండలిలో భారత్ తన హక్కుగా పొందాల్సిన స్థానాన్ని దక్కించుకోవడాన్ని మేము చూడాలనుకుంటున్నాం" అని ఆయన అన్నారు. భారత్ శాశ్వత సభ్యత్వానికి ఇప్పటికే అమెరికా, ఫ్రాన్స్, జర్మనీ, జపాన్, రష్యా వంటి దేశాలు మద్దతు తెలుపగా, ఇప్పుడు యూకే కూడా అదే బాటలో నిలవడం ప్రాధాన్యం సంతరించుకుంది. తన భారత పర్యటన ఉద్దేశాన్ని వివరిస్తూ, గత దశాబ్ద కాలంలోనే అతిపెద్ద వాణిజ్య ప్రతినిధి బృందంతో తాను ఇక్కడికి వచ్చినట్లు స్టార్మర్ తెలిపారు. ఇరు దేశాల మధ్య వాణిజ్య భాగస్వామ్యాన్ని రెట్టింపు చేయడమే తమ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. సాంకేతికత, ఆవిష్కరణల రంగాల్లో భారత్, యూకేలు ప్రపంచ నాయకులుగా కలిసి నిలుస్తున్నాయని చెప్పారు. ఈ పర్యటనలో భాగంగా యూకేలో బాలీవుడ్ చిత్రాల నిర్మాణానికి సంబంధించి ఒక ఒప్పందం కుదిరిందని కూడా ఆయన ప్రకటించారు. ఇదే సమయంలో, గాజాలో శాంతి ఒప్పందం మొదటి దశకు చేరుకోవడం పట్ల స్టార్మర్ హర్షం వ్యక్తం చేశారు. ఇది ఎంతో ఉపశమనం కలిగించే క్షణమని, ఈ శాంతి ప్రణాళిక పూర్తిస్థాయిలో అమలు కావడానికి యూకే మద్దతుగా నిలుస్తుందని ఆయన హామీ ఇచ్చారు.

## అమెరికా విధానాలు ఆర్థిక వృద్ధికి దోహదపడాలి

హైదరాబాద్: ''అమెరికా తీసుకునే నిర్ణయాలు, అనుసరించే విధానాలన్నీ సానుకూల దృక్పథంతో.. అమెరికా, భారత్ మధ్య సంబంధాలను మరింత పెంపొందించేలా ఉండాలి. ఇటీవల అమెరికా పెంచిన సుంకాలు, హెచ్ 1బీ వీసాలపై విధించిన కఠిన నిబంధనలతో సర్వత్రా ఆందోళన నెలకొంది. ఇలాంటి నిర్ణయాలు ఆర్థిక వ్యవస్థను ప్రభావం చేయటంతో పాటు.. అస్థిరతకు, అపార్థాలకు దారితీస్తాయి. రెండు దేశాల మధ్య ఆర్థిక వృద్ధికి దోహదపడే విధానాలు అనుసరిస్తే.. ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తుంది'' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు. అమెరికాలోని హడ్సన్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన 16 మంది ప్రతినిధులు గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో సమావేశమయ్యారు. వివిధ రంగాలకు చెందిన మేధావులు, బిజినెస్ లీడర్లు ఈ బృందంలో ఉన్నారు. ఇండియా ఫౌండేషన్ సారథ్యంలోని ఈ ప్రతినిధి బృందం భారత్‌లో పలు రాష్ట్రాల్లో పర్యటిస్తోంది. భారత్, అమెరికా మధ్య ద్వైపాక్షిక సంబంధాలు, వ్యాపార వాణిజ్య వ్యవహారాలు, విధానాలపై ఈ బృందం దేశంలోని వివిధ రాష్ట్రాల్లో పర్యటించి అభిప్రాయాలు సేకరిస్తోంది.

**తెలంగాణలో అనూహ్య పురోగతి**

''హైదరాబాద్ ఇప్పటికే ఐటీ, ఫార్మా రంగాల పెట్టుబడులకు గమ్యస్థానంగా.. ప్రపంచ నగరంగా అందరినీ ఆకర్షిస్తోంది. పెట్టుబడులు పెట్టేందుకు ప్రపంచ దిగ్గజ కంపెనీలు ఇక్కడికి వస్తున్నాయి. హైదరాబాద్ ఇప్పుడు న్యూయార్క్, టోక్యో, దక్షిణ కొరియాలతో పోటీ పడుతోంది. ప్రపంచ ప్రమాణాలకు దీటుగా ఇక్కడి మౌలిక సదుపాయాలు, తయారీ సామర్థ్యాలు మెరుగ్గా ఉన్నాయి.

## గ్రూప్-1 రగడ... ప్రభుత్వంపై ఎమ్మెల్సీ కవిత పోరాట ప్రకటన

హైదరాబాద్, అక్టోబర్ 09: తెలంగాణలో గ్రూప్1 నియామకాల వ్యవహారంలో ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతూ, ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు వరుస ఆందోళన కార్యక్రమాలను చేపట్టనున్నట్లు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రకటించారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో గ్రూప్1 అంశంపై నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశం అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. ఈ నెల 15న డివిజన్ బెంచ్ వెలువరించబోయే తీర్పు విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయిస్తుందని కవిత పేర్కొన్నారు. అందుకే, ఆ రోజు వరకు ప్రభుత్వంపై ఒత్తిడి కొనసాగించేందుకు వివిధ కార్యక్రమాలను రూపొందించినట్లు ఆమె స్పష్టం చేశారు. విద్యార్థి అమరవీరుల సాక్షిగా తమ పోరాటాన్ని నిన్ననే ప్రారంభించామని ఆమె గుర్తుచేశారు. గ్రూప్1 నోటిఫికేషన్ విడుదలైన నాటి నుంచి ఫలితాలు వెలువడే వరకు ప్రతి దశలోనూ ప్రభుత్వం తప్పులు చేసిందని కవిత తీవ్రంగా విమర్శించారు. ఈ అంశాన్ని తాను శాసనమండలిలో ప్రస్తావించినప్పటికీ, ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు.

# విజయవంతంగా ముగిసిన క్రీడా పోటీలు

* **విజేతలకు బహుమతి ప్రధానం**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో ,నిన్న మొదలైన 69వ పాఠశాలల ఎస్ జి ఎఫ్ జిల్లా స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ 69వ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాఠశాలల క్రీడా పోటీల విజేతల వివరాలు...అండర్ 17 బాలుర విభాగం లో కబడ్డీ... మొదటి బహుమతి ఇల్లందు,ద్వితీయ స్థానం అశ్వారావుపేట, తృతీయ స్థానం కొత్తగూడెం జోన్లు దక్కించుకున్నాయి. అదేవిధంగా ఖోఖో క్రీడలో ప్రథమ బహుమతి అశ్వారావుపేట, ద్వితీయ బహుమతి కొత్తగూడెం, తృతీయ బహుమతి పాల్వంచ జోన్లు దక్కించుకోగా,వాలీబాల్ క్రీడలో పాల్వంచ ప్రథమ బహుమతి, ఇల్లందు ద్వితీయ బహుమతి, కొత్తగూడెం తృతీయ బహుమతులు దక్కించుకున్నాయి. అండర్ 17 బాలికల విభాగంలో...కబడ్డీ క్రీడలో. ఇల్లందు ప్రథమ బహుమతిని అశ్వారావుపేట ద్వితీయ బహుమతిని భద్రాచలం తృతీయ బహుమతిని, ఖో ఖో క్రీడలో భద్రాచలం ప్రథమ బహుమతిని అశ్వారావుపేట ద్వితీయ బహుమతి ఇల్లందు తృతీయ బహుమతిని దక్కించుకుకోగా, వాలీబాల్ క్రీడలో ప్రథమ బహుమతి ని అశ్వారావుపేట ద్వితీయ బహుమతి ఇల్లందు తృతీయ బహుమతి భద్రాచలం దక్కించుకున్నాయి. అండర్ 14 బాలుర విభాగంలో... కబడ్డీ క్రీడలో పాల్వంచ మొదటి బహుమతి, అశ్వరావుపేట ద్వితీయ బహుమతి , పినపాక తృతీయ బహుమతి.... ఖో. ఖో. విభాగంలో అశ్వరావుపేట మొదటి బహుమతి పాల్వంచ ద్వితీయ బహుమతి తృతీయ బహుమతి దక్కించుకున్నాయి. వాలీబాల్ లో పాల్వంచ మొదటి బహుమ ఇల్లందు ద్వితీయ బహుమతి కొత్తగూడెం జోన్లు తృతీయ బహుమతి దక్కించుకున్నాయి.



అదేవిధంగా అండర్ 14 బాలికల విభాగంలో వాలీబాల్ క్రీడలో ప్రథమ బహుమతిని పాల్వంచ ద్వితీయ బహుమతిని అశ్వరావుపేట ద్వితీయ బహుమతి ఇల్లందు జోన్లు దక్కించుకోగా బాలికల కబడ్డీ క్రీడలో ప్రథమ బహుమతిని ఇల్లందు ద్వితీయ బహుమతి పాల్వంచ తృతీయ బహుమతి అశ్వరావుపేట దక్కించుకోగా, ఖో ఖో క్రీడలో ప్రథమ బహుమతిని ఇల్లందు, ద్వితీయ బహుమతిని భద్రాచలం తృతీయ బహుమతి ని అశ్వరావుపేట జోన్లు దక్కించుకోవడం జరిగినది. బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమానికి డిఇఓ నాగలక్ష్మి డి వై ఎస్ ఓ పరంధామ రెడ్డి , వ్యాయామ ఉపాధ్యాయులైన సీత,సుజాత, బుగ్గ వెంకటేశ్వర్లు, భావ్ సింగ్ లక్ష్మణ్,శేఖర్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా ప్రయోజనాల కోసం పోరాడే నాయకులను అడ్డుకోవడం ప్రజాస్వామ్యానికి అవమానం

* **మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు**



శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : ప్రజా ప్రయోజనాల కోసం పోరాడే నాయకులను అడ్డుకోవడం ప్రజాస్వామ్యానికి అవమానమని మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు అన్నారు. బి ఆర్ యస్ పార్టీ తలపెట్టిన ఛలో బస్ భవన్ కార్యక్రమం లో భాగంగా మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు ను కూకట్ పల్లి పోలీసులు ముందస్తు హౌస్ అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం అన్యాయంగా బస్ ఛార్జీలు పెంచిన నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ, ఈరోజు బస్ భవన్ వద్ద పెద్ద ఎత్తున శాంతియుతంగా నిరసన కార్యక్రమం నిర్వహించడానికి సిద్ధమైన మమ్మల్ని పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారన్నారు. మహిళలకు ఫ్రీ బస్ అని ఆ భారం అంతా పురుషుల మీద మోపుతున్నారన్నారు. ప్రజలపై భారం మోపే ఈ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ఊర చెరువు సుందరీకరణ చేపట్టాలి

* **కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్**



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఊర చెరువు సుందరీకరణ చేపట్టాలని కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. గురువారం కొంపల్లి మున్సిపాలిటీలో ఊర చెరువు సుందరీకరణ, దూలపల్లి బిటి రోడ్డు మంజూరు కొరకై తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ ఇఎన్ సి నర్సింహా రెడ్డి, ఎస్ ఇ వెంకటేశ్వర్లను తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ఆయన కలిసి దూలపల్లి ప్రజలు,వాహనదారులు పడే ఇబ్బంది తెలియజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఊర చెరువు సుందరీకరణ చేపట్టాలన్నారు. దూలపల్లి ఎన్ టి ఆర్ విగ్రహం నుండి ఇండస్ట్రియల్ ఏరియా వరకు సరైన రోడ్డు మార్గం లేక గుంతలు ఉండటం వల్ల ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారన్నారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ ఇఎన్ సి నర్సింహా రెడ్డి, ఎస్ ఇ వెంకటేశ్వర్లు సానుకూలంగా స్పందించి తక్షణ మంజూరుకు సహకరిస్తాం అని తెలిపారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ ఆ అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసారు.ఈ సమావేశంలో కొంపల్లి మాజీ సర్పంచ్ జిమ్మి దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.



## అభివృద్ధిని చూసి ఓర్వలేకనే బిఆర్ఎస్ విమర్శలు

* **రెండేళ్ల కాలంలోనే జోగిపేటలో రూ.250 కోట్ల అభివృద్ధి పనులు..**
* **జోగిపేట పట్టణం కళ కోల్పోవడానికి ప్రధాన కారకులు బీఆర్ఎస్ నాయకులే...**
* **మున్సిపల్ మాజీ కౌన్సిలర్ ఆకుల చిట్టిబాబు**

అందోలు, ప్రజాస్ఫూర్తి: జోగిపేట మున్సిపాలిటీలో జరుగుతున్న అభివృద్ధిపై ఓర్వలేకనే బీఆర్ఎస్ పార్టీ విమర్శలు చేస్తుందని అందోలు-జోగిపేట మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్, జిల్లా కాంగ్రెస్ నాయకుడు ఆకుల చిట్టిబాబు అన్నారు. గురువారం వాసవీనగర్‌లోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుతం జోగిపేటలోనే రెండేళ్ల కాలంలోనే జోగిపేట మున్సిపాలిటీలో రూ.250 కోట్ల అభివృద్ధి పనులు నడుస్తున్నాయన్నారు. రూ.80 కోట్లతో నిర్మిస్తున్న అజ్జమర్రి రోడ్డు పనులు ప్రారంభమయ్యాయని, మల్లన్న గండి నుంచి అజ్జమర్రి శివారు వరకు మట్టి రోడ్డు నిర్మాణం పూర్తయ్యిందని, మంజీరలో నీరు తగ్గగానే బ్రిడ్జి నిర్మాణం ప్రారంభమవుతుందని, మంగళవారం ఆర్అండ్‌బీ సీఈ కూడా పరిశీలించారన్నారు. జోగిపేట పట్టణం కళ కోల్పోవడానికి ప్రధాన కారకులు బీఆర్ఎస్ నాయకులేనని ఆరోపించారు. సంగుపేట వద్ద నుంచి బైపాస్ నిర్మిస్తున్నా ఆ పార్టీ ఎమ్మెల్యేలు పట్టించుకోలేదని దీనివల్ల పట్టణంలో వ్యాపారం పూర్తిగా దెబ్బతిన్నదన్నారు. అందోలు వద్ద రూ.43 కోట్లతో నర్సింగ్ కళాశాల, రూ.60 కోట్లతో 150 పడకల ప్రభుత్వాసుపత్రిని మంజూరు చేసి, 60 శాతం పనులు కూడా పూర్తయ్యాయన్నారు. రూ.6 కోట్లతో మున్సిపాలిటీ భవన నిర్మాణం జరుగుతుందన్నారు. రూ.20 కోట్లతో డివైడర్ పనులు కొనసాగుతున్నాయన్నారు. బీఆర్ఎస్ న బెదిరింపులకు భయపడేది లేదని అన్నారు. పదేళ్లు అధికారంలో ఉన్నా మాజీ జడ్పీ చైర్ పర్సన్ భర్త జైపాల్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ పి.నారాయణలు వారి స్వగ్రామాలకు కనీసం రోడ్లు కూడా వేసుకోలేదని ఆయన ఆరోపించారు. సీడీఆర్ ఫౌండేషన్ చైర్మన్ త్రిష రాజనర్సింహ జడ్పీ చైర్‌పర్సన్ కావడం ఖాయమని ధీమా వ్యక్త చేసారు.ఈ సమావేశంలో అత్మకమిటీ డైరెక్టర్‌లు చిట్యాల మధు, తుడుం యాదయ్య, ఖాలీద్, నాయకులు చోటుఖాన్, రాజు, హాజీ, అద్దు, నజీర్‌లతో పాటు తదితరులు పాల్గొన్నారు.



## గెరిల్లా పోరాట యోధుడు ఎర్నస్టో చేగువేరా

* **ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఘనంగా చేగువేరా 58వ వర్ధంతి:**
* **ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఫహీమ్ దాదా**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: గెరిల్లా పోరాట యోధుడు, ధైర్యశాలి, మూర్తీ భవించిన మానవత్వం వంటి విలువలు కలిగిన మహనీయుడు ఎర్నస్టో చేగువేరా అని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) కార్యదర్శి ఎస్ కే, ఫహీమ్ దాదా అన్నారు. చేగువేరా 58 వ వర్ధంతిని ఏఐవైఎఫ్ భద్రాది కొత్తగూడెం జిల్లా సమితి ఆధ్వర్యంలో శేషగిరి భవన్ లో ఏర్పాటు చేసిన చేగువేరా చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఫహీమ్ దాదా మాట్లాడుతూ క్యూబాలో జన్మించిన చేగువేరా కేవలం తన దేశానికే కాక అనేక దేశాలలో పర్యటించి పెట్టుబడిదారీ వ్యవస్థపై అలుపెరుగని పోరాటాలు నిర్వహించిన గొప్ప యోధుడు అని వారు ఉద్ఘాటించారు. వంద పండ్లను ఒక్కడే దాచుకోవడం క్యాపిటలిజం ఉన్నదాంట్లో అందరూ పంచుకోవడం కమ్యూనిజం అని చెప్పిన చేగువేరా మాటలు ప్రజా ఆకాంక్షలకు అద్దం పడుతుందని వారు అన్నారు.చేగువేరా అమెరికన్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా అనేక పోరాటాలు నిర్వహించాడని వారు అన్నారు.ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఖయ్యూమ్, భూపేష్, జావీద్, కొచ్చెర్ల రాకేష్,రణధీర్, ఇర్ఫాన్, నాదీమ్, అజయ్,రవి, విజయ్ కాంత్, త్రినేష్, షారుఖ్, సోహెల్, సంతోష్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమకారుడు మల్లికార్జున్ గౌడ్ మృతి



జిన్నారం (గుమ్మడిదల), ప్రజాస్ఫూర్తి 09:తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మల్లి కార్జున్ గౌడ్ గుండెపోటుతో గురువారం మృతి చెందాడు.గుమ్మడిదల మండలంలోని దోమడుగు గ్రామానికి చెందిన మల్లిఖార్జున గౌడ్(46) తెలంగాణ ఉద్యమ సమయంలో చురుకుగా పాల్గొన్నాడు. అనంతరం భారత రాష్ట్ర సమితి పార్టీలో సైతం పనిచేసి పార్టీ అభివృద్ధికి కృషి చేశారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమ సమయంలో ఉమ్మడి జిన్నారం మండలంలో చురుకైన పాత్ర వహించారు. కాగా గురువారం ఉదయం 6గంటల ప్రాంతంలో గుండెపోటు రాగా ఆసుపత్రికి తరలిస్తూ ఉండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. ఆయన స్వగ్రామం దోమడుగులో అత్యక్రియలు నిర్వహించారు. ఆయన మృతి పట్ల బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ కోలన్ బాల్ రెడ్డి, వెంకటేశం గౌడ్, మండల నాయకులు సంతాపం తెలిపారు.

## అడ్డగోలుగా పెంచిన ఆర్టీసీ బస్ టికెట్ల ధరలు వెంటనే తగ్గించాలి

* **కూకట్ పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బొట్టు విష్ణు**




కూకట్ పల్లి, (ప్రజాస్ఫూర్తి) : అడ్డగోలుగా పెంచిన ఆర్టీసీ బస్ టికెట్ల ధరలు వెంటనే తగ్గించాలని కూకట్ పల్లి నియోజకవర్గ ఎస్ సీ విభాగ అధ్యక్షులు, కూకట్ పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బొట్టు విష్ణు డిమాండ్ చేశారు. బి ఆర్ యస్ పార్టీ తలపెట్టిన "ఛలో బస్ భవన్" కార్యక్రమం లో భాగంగా కూకట్ పల్లి పోలీసులు కూకట్ పల్లి నియోజకవర్గ ఎస్ సీ విభాగ అధ్యక్షులు కూకట్ పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బొట్టు విష్ణు ముందస్తు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ మాటల్లో రాజ్యాంగ రక్షణ చేస్తున్నది రాజ్యాంగ భక్షణ అన్నారు. ప్రజల పక్షాన ప్రశ్నిస్తున్న, పోరాడుతున్న ప్రతీ సారి బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు, అక్రమ నిర్బంధాలు, అరెస్టులు చేయడం ఇదేనా ప్రజా స్వామ్యం అని అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇది ప్రజా ప్రభుత్వం ప్రజా పాలన అంటున్నారు. ఇది ముమ్మాటికి పోలీసుల తోని రాజ్యం నడిపిస్తున్న రేవంత్ రెడ్డి కి రాబోయే రోజులు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు.

## బీసీ రిజర్వేషన్ల పెంపు విషయంలో ప్రభుత్వ విధానం శాస్త్రీయంగా సరిగ్గా లేదు

* **బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్**

కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : బీసీ రిజర్వేషన్ల పెంపు విషయంలో ప్రభుత్వ విధానం శాస్త్రీయంగా సరిగ్గా లేదని బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల విషయంలో జీ.వో.నెం.9 ను శాస్త్రీయ పద్ధతిలో కాకుండా తమకు ఇష్టం వచ్చినట్లుగా వ్యవహరించడం వల్లే హైకోర్టు స్టే ఇవ్వాల్సి వచ్చిందన్నారు. బిఆర్ఎస్ పార్టీ తరపున అసెంబ్లీ వేదికగా మా నాయకులు, మేము ఎన్నోసార్లు ప్రభుత్వానికి హితవు పలికామన్నారు. ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలల్లోనే



బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుతో పాటు అనేక హామీలను కామారెడ్డి బీసీ డిక్లరేషన్ సాక్షిగా ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడి 22 నెలలు కావస్తున్న బీసీ రిజర్వేషన్ల అమలు, వారికి ఇచ్చిన హామీల అమలులో తూతూ మంత్రంగా వ్యవహరిస్తూ చేతులు దులుపుకుంటున్నారే తప్పా హామీల అమలులో ప్రభుత్వానికి ఎటువంటి చిత్తశుద్ధి కనిపించడం లేదన్నారు. రేవంత్ సర్కార్ మాత్రం మా సలహాలను, సూచనలను పెడచెవిన పెట్టడం వల్లే నేడు హైకోర్టులో స్టే విధించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. బీసీ రిజర్వేషన్లపై అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్తామని చెప్పిన రేవంత్ సర్కార్ మాటతప్పి ఢిల్లీకి పోయి ధర్నాల పేరుతో నాటకాలు ఆడారన్నారు. రేవంత్ రెడ్డి ఢిల్లీ వేదికగా చేయాల్సిన పోరాటాలను గల్లీలో చేస్తూ బీసీలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కామారెడ్డి వేదికగా బిసి డిక్లరేషన్ అమలు విషయంలో అఖిలపక్షం సభ్యుల సూచనలను, సలహాలను పెడచెవిన పెట్టకుండా శాస్త్రీయబద్ధంగా రూపొందించాలి. లేకపోతే వెనుకబడిన వర్గాల తరపున పోరాడేందుకు బిఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు.

## పారదర్శక పరిపాలన కోసం ఆర్‌టీఐ చట్టం ప్రభావవంతంగా అమలు కావాలి

* **జిల్లా అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్.**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: తెలంగాణ సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ) 20వ వార్షికోత్సవ వేడుకలు గురువారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ముఖ్య అతిథిగా హాజరై ఆర్‌టీఐ 2025 విజేతలకు బహుమతులు అందజేశారు.జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఐడీఓసీ కార్యాలయం వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఈ వేడుకలను ప్రత్యక్ష ప్రసారం ద్వారా జిల్లా అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ జిల్లా అధికారులతో కలిసి వీక్షించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం ప్రజలకు పారదర్శక పరిపాలన అందించేందుకు కీలక సాధనం. ప్రజల అభ్యర్థనలపై సమాచారం త్వరితగతిన, సమగ్రంగా అందించాలనే దిశగా ప్రతి అధికారి కృషి చేయాలి అని అన్నారు. ఆర్‌టీఐ చట్టం ద్వారా సమాచారాన్ని వేగంగా,



నిష్పాక్షికంగా అందించాలనే సంకల్పంతో జిల్లా అధికారులు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఐ డి ఓ సి కార్యాలయం నుంచి సిపిఓ సంజీవరావు, జిల్లా వైద్య శాఖ అధికారి జయలక్ష్మి, డి సి ఓ రుక్మిణి, ఏడి ఫిషరీస్ ఇంతియాజ్ ఖాన్, అడిషనల్ డి ఆర్ డి ఓ రవి, పౌరసరఫరాల మేనేజర్ త్రినాథ్ బాబు, భూగర్భ జలాల శాఖ అధికారి రమేష్, పరిశ్రమల శాఖ మేనేజర్ అన్ని శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో అట్లతద్ది వేడుకలు



**– వాయినాలు సమర్పించుకున్న కొత్త పెళ్లికూతుళ్లు**
**– గౌరీదేవికి పూజలు చేసిన మహిళలు**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: అట్లతద్ది వేడుకలను మహిళలు ఎంతో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అట్లతద్ది సందర్భంగా మహిళలు ముందు రోజు గోరింటాకుతో చేతులను అలంకరించుకున్నారు. గురువారం తెల్లవారుజామున లేచి స్నానం చేసి సూర్యోదయానికి ముందే భోజనం చేసి, ఇంట్లో గౌరీ దేవిని నిలబెట్టుకుని పూజలు చేశారు. కొత్తగూడెం పట్టణంలోని రామవరం గోధుమ వాగు వద్దకు సాయంత్రం చేరుకుని వాగు మట్టితో గౌరమ్మలను చేసి, దీపం, దూపం, నైవేద్యం, పూలు, పత్రితో పూజ చేసి హారతి ఇచ్చి, పాటలు పాడుతూ గౌరమ్మను వాగు నీటిలో కలిపారు. అనంతరం పత్రిని ఒళ్లో పెట్టుకుని వాగు సమీపంలో ఉయ్యాల ఊగి, ఆవుకును పూజించారు. అక్కడి నుంచి ఇంటికి వచ్చిన తరువాత గౌరీ దేవికి పూజలు చేసి మహిళలు ఒక్కొక్కరు 12 అట్లు దేవుడి వద్ద నైవేద్యంగా పెట్టి పూజించారు. కొందరు కుడుములు కూడా పెట్టే ఆనవాయితీ ఉంటుంది. అనంతరం అమ్మవారి వద్ద అట్లతద్ది కథలు చెప్పుకుని, రాత్రి చందమామ వచ్చిన తరువాత ఆవుపాలు నీళ్లు, గరిక, అక్షింతలు సమర్పించి దండం పెట్టుకుని వచ్చి గౌరీదేవి వద్ద హారతి ఇచ్చి తీర్థం, నైవేద్యం తీసుకుని ఉపవాస దీక్షను విరమిస్తారు. కుటుంబ





సంక్షేమం కోసం మహిళలు గౌరీ నోము నోచుకుని అట్లతద్ది వేడుకను జరుపుకుంటారు. అదేవిధంగా కొత్తగా పెళ్లైన మహిళలు మొదటి ఏడాది అట్లతద్ది సందర్భంగా ముత్తైదువులకు వాయినాలు ఇచ్చారు. ఇలా వాయినాలు ఇవ్వడం ద్వారా ఆ తరువాత జరిగే శుభకార్యాల్లో పాలు పంచుకునే అర్హత లభిస్తుందనేది వారి నమ్మకం.

**అట్లతద్ది శుభాకాంక్షలు తెలియజేసిన: జమలయ్య**

రామవరం గోధుమ వాగు బ్రిడ్జి వద్ద శెట్టి బలిజ సంఘం వారు ఏర్పాటు చేసిన అట్లతద్ది పండగ శుభాకాంక్షలు తెలియజేసిన సిపిఐ పట్టణ కార్యదర్శి జిల్లా కార్యవర్గ సభ్యులు కంచర్ల జమలయ్య, ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ పాటి మోహన్ రావు , మండల అధ్యక్షులు చప్పిటి కోటేశ్వరరావు, జిల్లా నాయకులు పితాని సత్యనారాయణ, పి సత్యనారాయణ, కుడిపూడి సత్యనారాయణ, గుబ్బల శీను, రాము , రామకృష్ణ ,మట్టపర్తి రమేష్ , వాసు, పితాని శీను, మహిళా సోదరిమల అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మా నోటి దగ్గర ముద్దను లాక్కున్నారు.. హైకోర్టు ఉత్తర్వులపై మాజీ ఎంపీ వీహెచ్ ఆవేదన



బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వం స్పందన సరిగా లేకపోతే తెలంగాణ బంద్‌కు పిలుపునిచ్చి రాష్ట్రాన్ని స్తంభింపజేస్తామని బీసీ ఉద్యమ నేత ఆర్. కృష్ణయ్య హెచ్చరించారు. బీసీల్లో ఏంతో చైతన్యం వచ్చిందని, ఊరురా స్పందన తెలుపుతామని, దేశాన్ని కదిలించేలా బంద్ ఉంటుందన్నారు. గురువారం ఆయన హైకోర్టు దగ్గర మీడియాతో మాట్లాడుతూ బీసీలంటే ఏం తమాషాగా ఉందా..? బీసీలంటే అంత చులకనగా ఉందా..? సీఎం పదవులు రావు, మంత్రి పదవులు రావు, లేక లేక సర్పంచ్ అవకాశం వస్తే వాటిని కూడా లాగేసుకోవడం సరికాదని ఆయన మండిపడ్డారు. ఈ సమాజంలో బీసీల సత్తా ఏంటో చూపిస్తామని, రాస్తారోకోలు, ధర్నాలు చేస్తామని ఆర్. కృష్ణయ్య హెచ్చరించారు. ఎన్నికల ప్రక్రియను రెండు వారాల పాటు ఆపడమనేది దురదృష్టకరమని, ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యాక ఎన్నికలను ఆపొద్దని సుప్రీంకోర్టు ఆదేశాలు ఉన్నాయన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలకు విరుద్ధంగా రెండు వారాల పాటు ఎన్నికలను వాయిదా వేయడం తాము తీవ్రంగా పరిగణిస్తున్నామని ఆయన చెప్పారు.

*** బీసీ రిజర్వేషన్ల రాకపోవడానికి బీజేపీనే కారణం : జాజుల శ్రీనివాస్ గౌడ్**

కోర్టులో రిజర్వేషన్లపై స్టే విచారకరమని, బిల్లులు ఆమోదముద్ర కాకపోవడానికి బీజేపీనే కారణమనని జాతీయ బీసీ సంఘాల అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. బిల్లుకు గవర్నర్ ఆమోదముద్ర వేస్తే ఈ పరిస్థితి రాకపోయేదన్నారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ తమకు జరిగిన అన్యాయం మీద బీసీలు నిరసనలు తెలపాలని, తమకు అన్యాయం చేసిన పార్టీలను శత్రువులుగా పరిగణించి ఎన్నికల్లో ఓడగొడతామన్నారు. బీసీల గొంతు కోస్తామంటే చూస్తూ ఊర్కోమని, సామాజిక విప్లవం మొదలైతుందన్నారు.

*** నోటి దగ్గరి ముద్దను లాక్కున్నారు : మాజీ ఎంపీ వీహెచ్**

బీసీ రిజర్వేషన్ల పై బీజేపీ, బీఆర్ఎస్ నేతలు తమ నోటి దగ్గర ముద్దను లాక్కున్నారని మాజీ ఎంపీ వీ.హన్మంతరావు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అగ్రకులాలకు పది శాతం రిజర్వేషన్లు ఇచ్చే సమయంలో తాము అడ్డుకోలేదని, బీసీలకు రిజర్వేషన్లు ఇస్తే అడ్డుకుంటారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

*** హైకోర్టు దగ్గర బీసీ నేతల ఆందోళన**

బీసీ రిజర్వేషన్లపై విచారణ జరుగుతున్న తెలంగాణ రాష్ట్ర హైకోర్టు దగ్గర గురువారం పెద్ద ఎత్తున బీసీ సంఘాల నేతలు, ప్రజా సంఘాల నాయకులు, బీసీ నేతలు అక్కడికి చేరుకున్నారు. విచారణ అనంతరం స్టే విషయం తెలిసిన తర్వాత వారు ఆందోళనకు దిగారు. బీసీ వ్యతిరేకులారా డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. జీవో 9 పై హైకోర్టు స్టే విధించిన విషయం తెలిసిన తర్వాత కోర్టు గేట్ నెం.4 దగ్గర నినాదాలు చేస్తూ, రోడ్డుపై బైఠాయించారు. వారిని ఉద్దేశించి పలువురు బీసీ సంఘం నేతలు మాట్లాడారు.



## బిజెపిలో భగ్గుమన్న వర్గ పోరు

*** బీజేపీ జిల్లాస్థాయి సమావేశం లో రసాబాస**
*** ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారంటూ ఒక వర్గం ఆరోపణ**
*** జిల్లా అధ్యక్షుడి తీరుపై రాష్ట్ర నాయకత్వానికి ఫిర్యాదు చేస్తాం**

ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం:భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలోని ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో గురువారం భారతీయ జనతాపార్టీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన జిల్లా స్థాయి సమావేశం రసాబాసగా మారింది. ఒక వర్గానికే ప్రాధాన్యత ఇస్తున్నారంటూ మరో వర్గం వారు ఆందోళన చేయడంతో బీజేపీలో ఉన్న అంతర్గత విభేదాలు బహిర్గతమయ్యాయి. బీజేపీ సీనియర్ నాయకుడు సీతారాం నాయక్, పినపాక కాంటెస్టెడ్ అభ్యర్థి బాలరాజు, మహబూబాబాద్ పార్లమెంటు కన్వీనర్ ముసుకు శ్రీనివాస్ రెడ్డి, భద్రాద్రి జిల్లా అధికార ప్రతినిధి పోనిశెట్టి వెంకటేశ్వర్లు, కొత్తగూడెం నియోజకవర్గ కోకన్వీనర్ బుడగం రవిలు సమావేశానికి చేరుకుని జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి తమను ఏ సమావేశానికి పిలవడంలేదని, తన వర్గానికి సంబంధించిన కొంతమందికి మాత్రమే సమాచారం ఇస్తున్నారని ఆరోపించడంతో ఇరు వర్గాల మధ్య కొంత ఘర్షణ వాతావరణం నెలకొంది. పలువురు ఇరు వర్గాలకు సర్ది చెప్పే ప్రయత్నం చేసినా గందరగోళం తగ్గకపోవడంతో బైరెడ్డి అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఖమ్మం పార్లమెంటు అభ్యర్థిగా పోటీ చేసినటువంటి తాండ్ర వినోద్ రావు ఫోటోను సైతం సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో పెట్టలేదని, ఈ విషయంపై రాష్ట్ర పార్టీ నాయకత్వానికి ఫిర్యాదు చేస్తామని మరో వర్గం ప్రకటించింది.

## న్యాయస్థానాలపై నెపం నెట్టి తప్పించుకునే ప్రయత్నం



కాంగ్రెస్, బీజేపీ కలిసి బీసీలను మోసం చేస్తున్నాయని మాజీమంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ కపట రాజకీయాలు చేస్తూ న్యాయస్థానాల పై నెపం నెట్టి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నదని ఆరోపించారు. రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్‌ల అంశంపై కాంగ్రెస్ పార్టీ మరోసారి తమ చిత్తశుద్ధి లేదని బయటపెట్టుకుందని పేర్కొన్నారు. తెలివిగా డ్రామాలాడుతున్నదని.. తాము పెంచాలనుకున్నాం కానీ కోర్టు అడ్డుపడిందని న్యాయస్థానంపై నెపం వేస్తూ బీసీ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం కాంగ్రెస్ చేస్తున్నదని ఆరోపించారు. చెల్లదని తెలిసినా, రిజర్వేషన్ పెంపు జీఓ జారీ చేశారని.. అనంతరం మళ్లీ పార్టీ అనుచరులతోనే కోర్టులో కేసు వేయించి ఆ నిర్ణయాన్ని అడ్డుకోవాలనే కుట్ర చేశారని పేర్కొన్నారు. ఈ ద్వంద్వ నాటకం ఎవరి కోసం? ఎవరిని పిచ్చోళ్ళని చేయడానికి ఈ డ్రామాలు ఆడుతున్నావ్ రేవంత్‌రెడ్డి? అని నిలదీశారు. రాజ్యాంగ సవరణ కోసం 22 నెలలుగా ఢిల్లీలో పోరాటం చేయకుండా కాంగ్రెస్ గల్లీలో మాత్రం డ్రామాలు ఆడుతున్నదని పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్‌ల పెంపు కోసం ఢిల్లీలో కాంగ్రెస్ నిజాయతీగా పోరాటం చేస్తే, తాము కూడా కలిసి వస్తామని.. కానీ ప్రజలను మోసం చేసే కపట రాజకీయాలకు తాము సహకరించమని వెల్లడించారు.

## రాష్ట్రంలో ఉత్తమ జిల్లాగా కరీంనగర్.. గవర్నర్ ప్రశంస



సమాచార హక్కు చట్టం ప్రజాస్వామ్యానికి మూల స్తంభమని, ఇది పారదర్శకతను ప్రోత్సహించి పౌరులను శక్తివంతులను చేస్తుందని గవర్నర్ విష్ణు దేవ్ వర్మ తెలిపారు. సాధారణ పౌరుడు సైతం అధికారాన్ని ప్రశ్నించగల 'సాధికారుడిగా' మార్చినందుకు ఆర్టీఐ చట్టాన్ని ఆయన ప్రశంసించారు. తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషన్ ఇటీవలే 5 వేలకు పైగా పెండింగ్ కేసులను పరిష్కరించడం రాష్ట్రంలో సుపరిపాలనకు ఇది నిదర్శనమని అన్నారు. రవీంద్ర భారతిలో గురువారం జరిగిన సమాచార హక్కు వారోత్సవాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గ్రామస్థాయిలో కూడా పౌరులు అభివృద్ధి నిధులను వినియోగించే తీరును తెలుసుకునేందుకు ఆర్టీఐని ఉపయోగిస్తున్నారని, ఇది ప్రజాస్వామ్యాన్ని మరింత సమ్మిళితంగా చేస్తుందని వివరించారు. పారదర్శకత, జవాబుదారీతనం సుపరిపాలనకు జంట స్తంభాలుగా పేర్కొన్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మాటలను ఉటంకించిన గవర్నర్.. ప్రతి అధికారి సమాచార సంరక్షకుడిగా మారాలని, ప్రతి పౌరుడు ఈ హక్కును బాధ్యతాయుతంగా ఉపయోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు జడ్జి జస్టిస్ సీపీ శ్యామ్ కోషి, సమాచార హక్కు చట్టం రాష్ట్ర చీఫ్ కమిషనర్ జి.చంద్రశేఖర్ రెడ్డి, హోంశాఖ కార్యదర్శి సీవీ ఆనంద్, జీఏడీ సెక్రటరీ ఎక్కా, ఆర్టీఐ కమిషనర్లు పీవీ శ్రీనివాస్, అయోధ్య రెడ్డి, భూపాల్, మోసినా పర్వీన్, వైష్ణవి, వివిధ జిల్లాల కలెక్టర్లు, అధికారులు, సమాచార హక్కు చట్టం కార్యకర్తలు పాల్గొన్నారు.

**ఆర్టీఐ అమలులో ఉత్తమ జిల్లాగా కరీంనగర్...**

సమాచార హక్కు చట్టాన్ని చక్కగా అమలు చేస్తున్న ఉత్తమ జిల్లాగా కరీంనగర్ మొదటి స్థానంలో నిలిచింది. మెదక్ జనగామ జిల్లాలు వరుసగా రెండు, మూడు స్థానాలు నిలిచాయి. అత్యుత్తమ శాకాధిపతిగా జలమండలి ఎండి అశోక్ రెడ్డి మొదటి స్థానంలో, సీడీఎం ఏ శ్రీదేవి రెండో స్థానంలో, ఎక్సైజ్ శాఖ కమిషనర్ రవికిషన్ మూడో స్థానంలో నిలిచి అవార్డులు తీసుకున్నారు. హోంశాఖ కార్యదర్శి సీవీ ఆనంద్, జీడి కార్యదర్శి ఎక్కా, బీసీ వెల్ఫేర్ కార్యదర్శి బాలమాయ దేవి, హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ గోవర్ధన్ రెడ్డి తదితరులు ఆర్టీఐ అమలులో చక్కని పనితీరు కనబరిచి అవార్డులు పొందారు.

## ఉద్యోగ ఆరోగ్య బీమా విధి విధానాలు ఏర్పాటు చేయండి: టీజీఈజేఏసీ



ఉద్యోగుల ఆరోగ్య పథకం విధి విధానాలు ఏర్పాటు చేసి ఈహెచ్ఎస్‌ను అమలు చేయాలని టీజీఈజేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరి జనరల్ ఏలూరి శ్రీనివాసరావు, ప్రతినిధి బృందం సీఎస్ రామక్రిష్ణరావును కోరారు. గురువారం టీజీఈజేఏసీ ప్రతినిధులు పలు సమస్యలు పరిష్కరించాలని సీఎస్ దృష్టికి తెచ్చారు. ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీల మేరకు తక్షణమే ఒక డీఏను విడుదల చేయాలని, జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ ను సమావేశ పరచి మిగిలిన సమస్యాలపై చర్చించి వాటిని కూడా పరిష్కరించాలని కోరారు. ఈ సమస్యలపై రాష్ట్ర ముఖ్యకార్యదర్శి రామకృష్ణారావు సానుకులంగా స్పందించి పరిష్కారానికి హామీ ఇచ్చారని వారు పేర్కొన్నారు. సీఎస్‌ను కలిసిన వారిలో దామోదర్ రెడ్డి, వంగ రవీందర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, సదానంద్ గౌడ్, కట్కం రమేష్, ముజీబ్ హుస్సేన్, కస్తూరి వెంకటేశ్వర్లు, బి.శ్యామ్, శ్రీనివాస్ రెడ్డి, దాస్య నాయక్, ప్రేమ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## అందరం వెళ్లి ప్రధాని ఇంటి ముందు కూర్చుందాం.. రిజర్వేషన్లు సాధించాకే తిరిగి హైదరాబాద్‌కు వద్దాం



బీసీ రిజర్వేషన్ల సాధనకు ఢిల్లీకి వెళ్లి ప్రధాని మోడీ ఇంటి ముందు కూర్చుందాం అని మాజీమంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. గురువారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. ఢిల్లీలో ఆమరణ నిరాహార దీక్ష చేస్తామంటే తామూ వెంట వస్తామని వెల్లడించారు. ప్రధానిని కలవడమే దీనికి పరిష్కారమని.. 42 శాతంపై వెనక్కి పోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. 42 శాతం అమల్లోకి వచ్చాకనే ఎన్నికలు పెట్టాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం బీసీలను మోసం చేసిందని.. ప్రతి అసెంబ్లీ సమావేశంలోనూ బీఆర్ఎస్ విధానాన్ని స్పష్టంగా చెప్పామని అన్నారు. జీవో ద్వారా సాధ్యం కాదని.. రాజ్యాంగ సవరణ జరిగితేనే ఫలితం ఉంటుందని చెప్పామని.. అయినా పట్టించుకోలేదని అన్నారు. బీసీలను అవమానం చేసేలా వ్యవహరించారని.. జీవో న్యాయస్థానంలో నిలబడదని సీఎం, మంత్రులు, అందరికీ తెలుసని ఆరోపించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చి ఎన్నికలు జరపాల్సిందేనని డిమాండ్ చేశారు. రాహుల్‌గాంధీ ప్రధాని అయ్యాకే బీసీ రిజర్వేషన్లు పెంచుతామన్న రేవంత్‌రెడ్డి జీఓ ఎందుకు ఇచ్చారని నిలదీశారు. బీసీలు ఏం చేస్తారులే అని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చెల్లని జీవో ఇచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 1992లో తమిళనాడు సీఎం జయలలిత ఎమ్మెల్యేలు, సిబ్బందిని ఢిల్లీ తీసుకెళ్లి బీసీ రిజర్వేషన్ల కోసం భీష్మించి కూర్చున్నారని.. అప్పుడు కేంద్రం దిగివచ్చి రాజ్యాంగ సవరణ చేయడం వల్ల తమిళనాడులో బీసీలకు రిజర్వేషన్లు పెరిగాయని వెల్లడించారు.

# బీసీలకు రిజర్వేషన్లు ఇచ్చాకే 'స్థానిక' ఎన్నికలకు వెళ్తాం: కాంగ్రెస్

బీసీల విషయంలో కాంగ్రెస్ పార్టీకి ఉన్న చిత్తశుద్ధి అందరికీ తెలుసని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. బీసీల సంక్షేమం కోసం చేస్తున్న కార్యక్రమాలను వాళ్లు గమనిస్తున్నారని చెప్పారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్ తదితర నేతలతో కలిసి ఆయన మాట్లాడారు. బీసీలకు మేలు చేయడాన్ని భారత రాష్ట్ర సమితి, భాజపా నేతలు తట్టుకోలేకపోతున్నారని విమర్శించారు. ఈ వ్యవహారంలో భారత రాష్ట్ర సమితి, భాజపా నేతలు హైకోర్టులో ఇంప్లీడ్ కాలేదన్నారు. ఈ పార్టీల నేతలు చరిత్రహీనులుగా మిగిలిపోతారని వ్యాఖ్యానించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చేందుకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. బీసీలకు రిజర్వేషన్లు ఇచ్చాకే స్థానిక ఎన్నికలకు వెళ్తామన్నారు. దేశంలోనే తొలిసారి కులగణన చేసింది తమ ప్రభుత్వమేనని చెప్పారు. ''రిజర్వేషన్లపై మాకు సంకల్పబలం ఉంది. అందుకే ఇక్కడివరకు చేరుకున్నాం. స్థానిక సంస్థల ఎన్నికలపై కొందరు కోర్టుకు వెళ్లారు. 2018లో భారత రాష్ట్ర సమితి తెచ్చిన చట్టం ఇప్పుడు ఓబీసీలకు ఉరితాడుగా మారింది. ఓబీసీలకు



మేలు చేద్దామన్న ఆలోచన ఆ పార్టీకి లేదు. మా ప్రభుత్వంపై లేనిపోని అభాండాలు వేస్తున్నారు. మీ అబద్ధాలు నమ్మేందుకు బీసీలు, సంఘాల నేతలు అమాయకులు కాదు. ఏం లెక్కలున్నాయో చెప్పాలని అడిగారు కనుకే కులగణన చేశాం. జీవో ఇచ్చేసి ఎన్నికలకు వెళ్తే దాన్ని కొట్టేసేవారు. అందుకే శాస్త్రీయంగా కులగణన చేపట్టి బిల్లు పాస్ చేశాం. లక్షమందికిపైగా ఉద్యోగులను పంపి వివరాలు సేకరించాం. క్యాబినెట్‌లో, అసెంబ్లీలో తీర్మానం చేశాం. ఆ రోజు బిల్లును అన్ని పార్టీలు ఏకగ్రీవంగా ఆమోదించాయి. గవర్నర్ ఆ బిల్లును రాష్ట్రపతికి పంపారు. అక్కడ పెండింగ్‌లో ఉంది. ఆ బిల్లును ఆపిందెవరో కేంద్రంలో ఉన్న భాజపా ప్రభుత్వం చెప్పాలి. ఎవరికి చిత్తశుద్ధి ఉందో.. ఎవరికి లేదో ప్రజలు ఆలోచించాలి. బీసీల బిల్లును భాజపా, భారాస కలిసి అడ్డుకుంటున్నాయి. ఈ నేతల వైఖరి చూస్తే దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉంది. కుట్రలు, కుతంత్రాలు చేస్తుందెవరో అందరికీ తెలుసు. రిజర్వేషన్లకు పరిమితి పెట్టింది భారాస.. బిల్లు ఆపింది భాజపా. ఈ పార్టీల నేతలను ఓబీసీలు ఎప్పటికీ క్షమించరు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు వచ్చేవరకు రాజకీయంగా, కోర్టులో పోరాడతాం'' అని నేతలు మాట్లాడారు.




## తెలంగాణ 'స్థానిక' ఎన్నికల నోటిఫికేషన్ నిలిపివేత: ఎస్ఈసీ ప్రకటన

హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లపై హైకోర్టు తీర్పు నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. ఇటీవల విడుదల చేసిన స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్‌ను నిలిపివేసినట్లు ప్రకటించింది. హైకోర్టు ఆదేశాల మేరకే ఈ చర్యలు తీసుకున్నట్లు స్పష్టం చేసింది. ఎన్నికల కోడ్ అమలు, నామినేషన్ల ప్రక్రియను నిలిపివేసినట్లు తెలిపింది. తదుపరి నోటిఫికేషన్ ఇచ్చేవరకు ఎన్నికల ప్రక్రియలన్నీ నిలిపివేసినట్లు ప్రకటించింది.

## 'స్థానిక' ఎన్నికల్లో లబ్ధికి కాంగ్రెస్ చేసిన కుట్రలు విఫలమయ్యాయి

హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు కాంగ్రెస్ చేసిన కుట్రలు విఫలమయ్యాయని భారత రాష్ట్ర సమితి నేత హరీశ్‌రావు అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై హైకోర్టు స్టే వ్యవహారంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికైనా నాటకాలు ఆపాలన్నారు. ఆరు గ్యారంటీల్లాగే 42 శాతం బీసీ రిజర్వేషన్లూ డ్రామా అని వ్యాఖ్యానించారు. 55 ఏళ్లు పరిపాలించిన కాంగ్రెస్ ఏనాడైనా బీసీల కోసం పనిచేసిందా? అని ప్రశ్నించారు. హస్తం పార్టీకి చిత్తశుద్ధి ఉంటే జాతీయ నేతలతో దిల్లీ వేదికగా కొట్లాడాలన్నారు. పార్లమెంటులో ఈ మేరకు చట్టం చేయించాలన్నారు. కలిసి వచ్చేందుకు తమ పార్టీ ఎల్లప్పుడూ సిద్ధమేనని తెలిపారు.

*** కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదు: కిషన్‌రెడ్డి**

రేవంత్‌రెడ్డి సర్కారు చేతకానితనం వల్లే హైకోర్టు



స్టే విధించిందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. బీసీ రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రభుత్వానికి, కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి లేదన్నారు. ప్లాన్‌బీ సిద్ధం చేసుకుని కోర్టులో తూతూమంత్రంగా వాదించారని ఆరోపించారు. బీసీలను హస్తం పార్టీ రాజకీయంగా వాడుకుంటోందని వ్యాఖ్యానించారు. కేంద్రంలో కాంగ్రెస్ ఉన్నప్పుడే సుప్రీం కోర్టు రిజర్వేషన్లపై 50శాతం పరిమితి విధించిందని గుర్తుచేశారు. కనీస అవగాహన లేకుండా రేవంత్ ప్రభుత్వం వ్యవహరించిందన్నారు.

**మాపై అంభాడాలు వేయొద్దు..**

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల అంశంపై హైకోర్టు స్టే విధించేందుకు కాంగ్రెస్ పార్టీనే కారణమని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు విమర్శించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు తమ పార్టీ కట్టుబడి ఉందన్నారు. అసెంబ్లీలో బీసీ బిల్లుకు, ఆర్డినెన్స్‌కు పూర్తిగా మద్దతిచ్చినట్లు గుర్తుచేశారు. భాజపా ఎంపీ ఆర్.కృష్ణయ్య ఇంప్లీడ్ పిటిషన్ వేశారని చెప్పారు. గవర్నర్‌కు బిల్లు పంపి 3 నెలలు కూడా ఓపిక పట్టలేదని విమర్శించారు. జీవో ఇచ్చి షెడ్యూల్ ప్రకటించడంలో లోగుట్టు ఏంటని ప్రశ్నించారు. కోర్టు స్టేకు ప్రభుత్వానిదే బాధ్యతని, తమపై అభాండాలు వేయొద్దన్నారు.

## రూ.18 కోట్ల ఘరానా మోసం.. బాధితులపై దాడి..!




పటాన్‌చెరు: వైకాపా నేత చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పేరు చెప్పి విద్య అనే మహిళ మోసం చేసిందంటూ బాధితులు పటాన్‌చెరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రూ.18 కోట్ల మేర మోసం చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. చెవిరెడ్డి పీఏ నుంచి రూ.2 వేల కోట్లు వస్తున్నాయని, కంటైనర్లు కొనాలని కొంత మంది వద్ద, బంగారం ఇస్తానని చెప్పి మరికొంత మంది దగ్గర ఆమె డబ్బులు తీసుకున్నట్లు బాధితులు తెలిపారు. డబ్బులు వసూలు చేశాక సికింద్రాబాద్ పరిధిలోని వారాసిగూడ నుంచి సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరుకు మకాం మార్చిందని వాపోయారు. డబ్బులు ఇవ్వాలని పలుమార్లు అడగ్గా.. అందర్నీ గురువారం రావాలని చెప్పి.. వచ్చిన వారందర్నీ గదిలో పెట్టి దాడి చేయించిందని ఆవేదన వ్యక్తం చేశారు. దాడిలో కమలమ్మ అనే బాధితురాలికి తీవ్ర గాయాలు కాగా.. ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

## బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చి తీరతాం: మంత్రి వాకిటి శ్రీహరి

హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్9 అమలుపై హైకోర్టు స్టే విధించిన సంగతి తెలిసిందే. ఉన్నత న్యాయస్థానం నిర్ణయంతో బీసీల నోటి వద్ద ముద్ద లాగేసినట్లయిందని మంత్రి వాకిటి శ్రీహరి వ్యాఖ్యానించారు. బీసీలు నిరాశ చెందాల్సిన అవసరం లేదని, 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చి తీరతామన్నారు. కోర్టు తీర్పు కాపీ చూసిన తర్వాత ఎలా ముందుకెళ్లాలో ఆలోచిస్తామని చెప్పారు. ''హైకోర్టు తీర్పు కాపీ వచ్చాక సీఎం రేవంత్‌రెడ్డితో చర్చిస్తాం. సుప్రీం కోర్టుకు వెళ్లడంపై నిర్ణయం తీసుకుంటాం. కోర్టులో కేసులు వేయించింది భారత రాష్ట్ర సమితే. భాజపాతో కుమ్మక్కై బీసీ రిజర్వేషన్లు అడ్డుకుంది. హైకోర్టు స్టే ఇవ్వకుండా ఉండేందుకు ఎంతో ప్రయత్నించాం'' అని వాకిటి శ్రీహరి పేర్కొన్నారు.

*** హైకోర్టు స్టే విధిస్తుందనుకోలేదు: మంత్రి పొన్నం**

స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్‌పై హైకోర్టు స్టే విధిస్తుందనుకోలేదని, ఉత్తర్వుల కాపీ అందిన తర్వాత భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రభుత్వం తరఫున హైకోర్టులో వాదనలు బలంగా వినిపించామని, స్థానిక సంస్థల ఎన్నికలు జరగకపోవడంతో కేంద్ర నిధులు రావడం లేదని తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు



కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. భారత రాష్ట్ర సమితి, భాజపా.. హైకోర్టులో ఎందుకు ఇంప్లీడ్ కాలేదో చెప్పాలన్నారు.

## గడువులోగా గవర్నర్ ఆమోదించకపోతే అది చట్టమే: ఏజీ

హైదరాబాద్: బీసీ రిజర్వేషన్ల అంశంపై తెలంగాణ హైకోర్టులో రెండో రోజు వాదనలు కొనసాగుతున్నాయి. బీసీ రిజర్వేషన్ల పెంపు జీవోను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై బుధవారం సుదీర్ఘ విచారణ జరగ్గా.. గురువారం కూడా వాదనలు కొనసాగుతున్నాయి. ప్రభుత్వం తరఫున ఏజీ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు. బీసీ కులగణనకు అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానం చేసిందని, స్వాతంత్ర్యం తర్వాత సమగ్ర కులగణన సర్వే తెలంగాణలోనే జరిగిందని అన్నారు. ఇంటింటికెళ్లి సర్వే చేశారని, ఎవరూ అభ్యంతరం వ్యక్తం చేయలేదని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ''బీసీల జనాభా 57.6 శాతం ఉందనడాన్ని ఎవరూ కాదనడం లేదు. 57.6 శాతం జనాభా ఉన్నా.. 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని ప్రభుత్వం ఏకగ్రీవంగా



నిర్ణయించింది. గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థల్లో 42 శాతం ఇవ్వాలని అసెంబ్లీ నిర్ణయించింది. బీసీల్లో రాజకీయ వెనుకబాటుతనం ఉందని అసెంబ్లీ గుర్తించి తీర్మానం చేసింది. గడువులోగా గవర్నర్ ఆమోదించకపోతే చట్టంగా భావించాల్సి ఉంటుంది. తమిళనాడు ప్రభుత్వం, సుప్రీం తీర్పు ప్రకారం నోటిఫై చేయనక్కర్లేదు. అసెంబ్లీ చేసిన చట్టానికి సూత్రప్రాయ ఆమోదం ఉంది. ఇది రాష్ట్ర ప్రజల కోరిక. దాన్ని అసెంబ్లీ ఆమోదించింది. శాస్త్రీయ పద్ధతిలో కులగణన సర్వే జరిగింది. సర్వేలో అన్ని కులాల లెక్కలు తెలిశాయి. బీసీల్లోని సబ్ కేటగిరీల వారీగా వివరాలు సర్వేలో తేలాయి. అగ్రవర్ణాల లెక్కలు కూడా బయటకు వచ్చాయి. స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ వెలువడింది. కొందరు ఇది నోటిఫికేషన్ కాదంటున్నారు. అది తప్పు'' అని ఏజీ పేర్కొన్నారు. నోటిఫికేషన్ ప్రతులను ధర్మాసనం ముందుంచారు. నోటిఫికేషన్ వచ్చిన తర్వాత న్యాయస్థానాల జోక్యం ఉండబోదని వాదించారు. ఈ అంశాన్ని సుప్రీం కోర్టు కూడా స్పష్టం చేసినట్లు న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు.

## స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్.. తెలంగాణ హైకోర్టు స్టే

హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలంగాణ ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించడంపై హైకోర్టు స్టే విధించింది. ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. నాలుగు వారాల్లోగా కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ప్రభుత్వ కౌంటర్లపై అభ్యంతరాల దాఖలుకు పిటిషనర్లకు రెండు వారాల గడువు విధించింది. తదుపరి విచారణను ఆరు వారాలకు వాయిదా వేసింది. మరోవైపు స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ పైనా హైకోర్టు స్టే విధించింది. ఈ నేపథ్యంలో ఎన్నికల ప్రక్రియ ఆరు వారాలపాటు నిలిచిపోనుంది. బీసీ రిజర్వేషన్లపై హైకోర్టులో రెండు రోజుల పాటు సుదీర్ఘ వాదనలు జరిగాయి. ప్రభుత్వం తరఫున ఏజీ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు. బీసీ కులగణనకు అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానం చేసిందని, స్వాతంత్ర్యం తర్వాత సమగ్ర కులగణన సర్వే తెలంగాణలోనే జరిగిందని అన్నారు. ఇంటింటికెళ్లి సర్వే చేశారని, ఎవరూ అభ్యంతరం వ్యక్తం చేయలేదని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్రంలో బీసీ జనాభా 57.6శాతం ఉన్నట్లు తేలిందన్న ఆయన.. 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని ప్రభుత్వం ఏకగ్రీవంగా



నిర్ణయించినట్లు కోర్టుకు వివరించారు. బీసీల్లో రాజకీయ వెనుకబాటుతనం ఉందని గుర్తించే.. అసెంబ్లీ తీర్మానం చేసిందన్నారు. మరో న్యాయవాది రవివర్మ తన వాదనలు వినిపిస్తూ... రాజ్యాంగంలో రిజర్వేషన్లపై ఎక్కడా 50శాతం సీలింగ్ లేదన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలు కలిపి 85 శాతం జనాభా ఉన్నారని, 85 శాతం జనాభాకు 42 శాతంతో కలిపి 67 శాతమే రిజర్వేషన్లు ఇస్తున్నామని వివరించారు. 15 శాతం జనాభాకు 33 శాతం ఓపెన్‌గానే ఉందన్నారు. వాదనలు విన్న ధర్మాసనం స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్‌పై స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

## ఆర్టీసీ బస్ భవన్ వద్ద భారత రాష్ట్ర సమితి నేతల నిరసన

హైదరాబాద్: హైదరాబాద్‌లో బస్సు ఛార్జీల పెంపును నిరసిస్తూ మాజీ మంత్రులు, భారత రాష్ట్ర సమితి నేతలు కేటీఆర్, హరీశ్‌రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, పద్మారావు, సబితా ఇంద్రారెడ్డి, పార్టీ నేతలు ఆర్టీసీ బస్ భవన్ వద్దకు చేరుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి నేతలు, కార్యకర్తలు పెద్దఎత్తున అక్కడికి చేరుకోవడంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఆ చిత్రాలు.









## తొలి దశ హ్యామ్ రోడ్ల నిర్మాణానికి రూ.10,986 కోట్లు

**: మంత్రి కోమటిరెడ్డి**



హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా దశల వారీగా హ్యామ్ (హైబ్రిడ్ యాన్యుటీ మోడల్) రోడ్ల నిర్మాణం చేపడతామని తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. హ్యామ్ రోడ్ల నిర్మాణంపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో కలిసి సచివాలయంలో అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. మొదటి దశలో రూ.10,986 కోట్లతో రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు కోమటిరెడ్డి చెప్పారు. మొదటి దశ రోడ్ల నిర్మాణానికి వచ్చే నెలలో టెండర్లు పిలుస్తామన్నారు. మండల కేంద్రాల నుంచి జిల్లా కేంద్రాలకు రెండు వరుసల హ్యామ్ రోడ్లు.. జిల్లా కేంద్రాల నుంచి రాష్ట్ర రాజధానికి నాలుగు వరుసల రోడ్ల నిర్మాణం చేస్తామని వివరించారు.



# ఏడీజీపీ స్థాయి అధికారికే న్యాయం జరగలేదు: ఖర్గే

హరియాణాకు చెందిన సీనియర్ ఐపీఎస్ అధికారి పూరన్ కుమార్ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు. అమానవీయత, సామాజిక అసమానత, సానుభూతి లేమికి ఈ కేసు ఒక నిదర్శనమన్నారు. 'ఎక్స్' వేదికగా కాషాయ పార్టీపై విమర్శలు గుప్పించిన ఖర్గే.. ఆ పార్టీ విధానాలే దళిత ఐపీఎస్ మృతికి కారణమన్నారు. "ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, బలహీన వర్గాల వారికి భాజపా విధానాలు శాపంగా మారాయి. ఏడీజీపీ స్థాయి దళిత అధికారికీ న్యాయం జరగలేదు. సుప్రీంకోర్టులో భారత ప్రధాన న్యాయమూర్తిపై బహిరంగంగా దాడి జరిగింది. అయినా వాళ్లు సమర్థించుకుంటున్నారు. దీంతో సబ్‌కా సాత్ నినాదం ఓ జోక్ అని అర్థం చేసుకోవాలి. ఓ దళితుడిని మూక హత్య చేసినా ప్రధాని ఖండించలేదు. ఇది కొందరి వ్యక్తులకే పరిమితం కాదు.. దళితులు, ఆదివాసీలు, వెనుకబడిన వర్గాల ఆత్మగౌరవాన్ని అణచివేసే అన్యాయ వ్యవస్థకు నిదర్శనం. ఇది రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం" అని కాంగ్రెస్ అధ్యక్షుడు తీవ్ర స్థాయిలో స్పందించారు. 2001 బ్యాచ్ హరియాణా క్యాడర్‌కు చెందిన ఐపీఎస్ అధికారి పూరన్ కుమార్ (52).. చండీగఢ్‌లో తన నివాసంలో అక్టోబర్ 7న ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ బలవన్మరణానికి సీనియర్ల వేధింపులే కారణమని పేర్కొంటూ ఓ సూసైడ్ నోట్‌లో పేర్కొనడం సంచలనం రేపుతోంది. ఇదే విషయంపై ఆయన భార్య, ఐఏఎస్ అధికారిణి అమ్నీత్ పి కుమార్.. ముఖ్యమంత్రికి లేఖ రాశారు. లేఖలో ఉన్నతాధికారుల పేర్లు రాసినప్పటికీ చండీగఢ్ పోలీసులు ఇప్పటికీ కేసు నమోదు చేయలేదని ఆరోపించారు.

## డిజిటల్ ఐడీ దిశగా యూకే.. మన ఆధార్‌పై కీర్ స్టార్మర్ మనసు



ప్రపంచంలోనే అతిపెద్ద బయోమెట్రిక్ డేటాబేస్ విప్లవంగా మన 'ఆధార్' గుర్తింపు పొందిన సంగతి తెలిసిందే. అందుకే యూకే ప్రధాని కీర్ స్టార్మర్ కూడా దీనిపై ఆసక్తి పెంచుకున్నారు. తమ దేశంలో ప్రవేశపెట్టబోయే డిజిటల్ ఐడీ వ్యవస్థ కోసం మన 'ఆధార్'ను అధ్యయనం చేస్తున్నారు. ఇందుకోసం ఆధార్ రూపకర్త నందన్ నీలేకనితోనూ సమావేశమయ్యారు. యూకే ప్రధాని కీర్ స్టార్మర్ ప్రస్తుతం భారత్‌లో పర్యటిస్తోన్న సంగతి తెలిసిందే. బుధవారం ముంబయి చేరుకున్న ఆయన.. ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నీలేకనితో భేటీ అయ్యారు. ఈ విషయాన్ని స్టార్మర్ అధికార ప్రతినిధి ఒకరు మీడియాకు వెల్లడించారు. అయితే, ఇన్ఫోసిస్‌తో వాణిజ్య ఒప్పందం కోసం ఈ భేటీ జరగలేదని స్పష్టం చేశారు. ఆధార్ వ్యవస్థ పనితీరు, ఇతర వివరాల గురించి తెలుసుకునేందుకు నీలేకనితో సమావేశమైనట్లు పేర్కొన్నారు. ప్రస్తుతానికి తమ డిజిటల్ ఐడీ ప్రణాళికల్లో బయోమెట్రిక్ డేటా అంశం లేదని తెలిపారు. అక్రమ వలసదారులను అరికట్టేందుకు యూకేలో డిజిటల్ ఐడీలను ప్రవేశపెట్టనున్నట్లు గత నెల స్టార్మర్ వెల్లడించారు. స్మార్ట్‌ఫోన్‌లో ఉండే ఈ డిజిటల్ ఐడీ సాయంతో యూకే పౌరులు ఆరోగ్య సంరక్షణ, సంక్షేమ పథకాలు, ఇతర ప్రజా సేవలను సులభంగా పొందొచ్చని తెలిపారు. ఒకవేళ ఈ డిజిటల్ ఐడీ కార్డు లేకపోతే యూకేలో పని చేసేందుకు అర్హత లేనట్లేనని వెల్లడించారు. మరోవైపు భారత్ పర్యటనకు వచ్చే ముందు కూడా స్టార్మర్ ఈ అంశాన్ని ప్రస్తావించారు. "భారత్‌లో ఆధార్ ఐడీ వ్యవస్థ భారీ విజయం సాధించింది. అందుకే మా పర్యటనలో దీన్నీ అజెండాగా పెట్టుకున్నాం. నా సమావేశాల్లో ఆధార్‌కు సంబంధించి కూడా ఓ భేటీ ఉంటుంది" అని తెలిపారు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత నుంచి బ్రిటన్‌లో గుర్తింపు కార్డులు తప్పనిసరి కాదంటూ నిర్ణయం తీసుకున్నారు. వాటి వల్ల వ్యక్తిగత స్వేచ్ఛకు భంగం కలుగుతుందని, ప్రైవేటు సమాచారం ప్రమాదంలో పడుతుందని పౌర హక్కుల కార్యకర్తలు ఆరోపించడంతో నాడు ఆ నిర్ణయం తీసుకున్నారు. ఆ తర్వాత టోనీ బ్లెయర్ ప్రధానిగా ఉన్న సమయంలో బయోమెట్రిక్ ఆధారిత ఐడీకార్డులను తీసుకొచ్చేందుకు ప్రయత్నించినా.. విపక్షాలు, ప్రజల నుంచి వ్యతిరేక రావడంతో ఆ ఆలోచనను విరమించుకున్నారు. ఇప్పుడు వలసల కట్టడిపై చర్యలు చేపట్టిన కీర్ స్టార్మర్ ప్రభుత్వం 'డిజిటల్ ఐడీ' ప్రణాళికలు మొదలుపెట్టింది. ఇక, భారత ప్రభుత్వం 2009 జూన్ 25న భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ(యూఐడీఏఐ)ని ఏర్పాటుచేసింది. ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకులు నందన్ నీలేకనిని క్యాబినెట్ మంత్రి హోదాతో దానికి ఛైర్మన్‌గా నియమించింది. 2010 సెప్టెంబర్ 29న మహారాష్ట్రలోని ఒక గ్రామంలో తొలి ఆధార్ కార్డు జారీచేశారు. అది మొదలు గత పదిహేనేళ్లలో 143 కోట్ల మందికి ఆధార్ నంబర్లను అందించారు.

## కొన్ని పార్టీలు ఎస్ఐఆర్‌కు సహకరించడం లేదు
## ఈసీ కీలక వ్యాఖ్యలు

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ అంశంపై సుప్రీం కోర్టులో గురువారం కూడా విచారణ జరిగింది. ఈ సందర్భంగా ఎన్నికల సంఘం కీలక వ్యాఖ్యలు చేసింది. కొన్ని రాజకీయ పార్టీలు, సంస్థలు ఈసీ ప్రయత్నాలకు సహకరించకుండా.. తప్పుడు కథనాలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నాయని తెలిపింది. బిహార్‌లో ఎస్ఐఆర్‌పై దాఖలైన పలు పిటిషన్లపై గురువారం వాదనలు కొనసాగాయి. అంతకుముందు ప్రతిపాదిత జాబితాలో పేరు ఉండి, తుది జాబితాలో తొలగించిన 3.36లక్షల ఓటర్ల వివరాలను అందజేయాలని సుప్రీం పేర్కొంది. వీటిని పరిశీలించిన జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్య బాగ్చీల ధర్మాసనం.. ఈ అంశం గందరగోళంగా ఉందని, వీరికి అప్పీలు చేసుకునే అవకాశం కల్పించాలని స్పష్టం చేసింది. ఇందుకోసం పారా లీగల్ వాలంటీర్లను అందుబాటులో



ఉంచాలని బిహార్ లీగల్ సర్వీసెస్ ఛైర్‌పర్సన్‌ను ఆదేశించింది. బిహార్ ఎస్ఐఆర్‌కు సంబంధించి పలువురు పిటిషనర్లు వాదనలు వినిపించారు. దాదాపు 10శాతం ఓటర్లు తమ హక్కును కోల్పోయారని సామాజిక వేత్త యోగేంద్ర యాదవ్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. భారీ సంఖ్యలో కొత్త ఓటర్లు చేరగా.. వారి నుంచి నిర్దేశిత ధ్రువీకరణ పత్రాల్లో ఒక్కటి కూడా తీసుకోలేదని ఆరోపించారు. వీటికితోడు లక్షలాది మహిళా ఓటర్ల పేర్లు గల్లంతయ్యాయని, లక్షల కుటుంబాల్లో అధిక సంఖ్యలో ఓటర్లు ఉండటం కూడా పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. వాదనలు విన్న సుప్రీం ధర్మాసనం.. ఎన్నికల సంఘాన్ని ఉద్దేశిస్తూ కీలక వ్యాఖ్యలు చేసింది. ఎస్ఐఆర్‌ను దేశవ్యాప్తంగా నిర్వహించాలని నిర్ణయించుకున్నారని, బిహార్ అనుభవాల నుంచి పాఠాలు నేర్చుకుంటారని, ఇప్పటికైనా మరింత అప్రమత్తంగా వ్యవహరిస్తారని ఆశాభావం వ్యక్తం చేసింది. అధికారులకు వాళ్లు ఏం చేస్తున్నారో అనే విషయం తెలుసునని సుప్రీం ధర్మాసనం పేర్కొంది. తదుపరి విచారణను అక్టోబర్ 16కు వాయిదా వేసింది.

## ప్రతి ఇంటికీ ప్రభుత్వ ఉద్యోగం తేజస్వీ యాదవ్ హామీ

బిహార్ అసెంబ్లీ ఎన్నికలకు షెడ్యూల్ ఖరారైన నేపథ్యంలో ప్రధాన రాజకీయ పార్టీలు దూకుడు పెంచాయి. ఓటర్లను ఆకర్షించేందుకు ఆయా పార్టీల నేతలు హామీల వర్షం కురిపిస్తున్నారు. ఈ క్రమంలో తాము (ఇండియా కూటమి) అధికారంలోకి వస్తే ప్రతి కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తామని ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ హామీ ఇచ్చారు. పట్నాలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పడిన 20 రోజుల్లోపే ఇందుకు సంబంధించి ప్రతిపాదిత చట్టాన్ని తీసుకువస్తామని అన్నారు. "20 ఏళ్లలో రాష్ట్ర యువతకు ఎన్డీయే ఉద్యోగాలు కల్పించలేకపోయింది. మేం అధికారంలోకి వచ్చిన 20 రోజుల్లోనే చట్టాన్ని తీసుకువస్తాం. 20 నెలల్లోనే దీన్ని అమలు చేసేలా చర్యలు తీసుకుంటాం. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలోనూ ప్రభుత్వ ఉద్యోగాలపై హామీ ఇచ్చాను. నేను అధికారంలో ఉన్న ఆ కొద్ది కాలంలోనే ఐదు లక్షల ఉద్యోగాలు కల్పించా. నాకు ఐదేళ్ల సమయం ఉంటే ఎన్ని ఉద్యోగాలు ఇస్తానో మీరే ఊహించుకోవచ్చు" అని బిహార్ మాజీ ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్‌ను కాపీక్యాట్ అంటూ విమర్శలు గుప్పించారు. ప్రభుత్వం కొన్ని నెలలుగా చేపడుతున్న కార్యక్రమాలు గత ఎన్నికల సమయంలో తాము ఇచ్చిన హామీలను పోలిఉన్నాయని ఆరోపించారు.



## 'ముందు మేం షాకయ్యాం'..
## దాడికి యత్నం ఘటనపై సీజేఐ గవాయ్



ఢిల్లీ: దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్. గవాయ్‌పై దాడికి యత్నించిన ఘటన ఇటీవల కలకలం రేపింది. దీన్ని పలు రాజకీయ పార్టీలు తీవ్రంగా ఖండించాయి. తాజాగా దీనిపై సీజేఐ జస్టిస్ గవాయ్ స్పందించారు. ఆ ఘటనతో తొలుత తాను షాకయ్యానని తెలిపారు. ఓ కేసు విచారణ సందర్భంగా ఈ ఘటన ప్రస్తావనకు వచ్చింది. దీనిపై సీజేఐ జస్టిస్ గవాయ్ మాట్లాడుతూ.. "సోమవారం నాటి ఘటనతో నేను, సహచర జడ్జి షాక్ అయ్యాం. అయితే, మా వరకు అది ఒక మర్చిపోయిన అధ్యాయం" అని అన్నారు. మరో న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్ స్పందిస్తూ.. "సీజేఐపై దాడికి యత్నించడాన్ని జోక్‌గా తీసుకోవద్దు. ఇది సుప్రీంకోర్టును అవమానించడమే. బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాల్సిందే" అని అన్నారు. సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా మాట్లాడుతూ.. ఈ ఘటన క్షమార్హం కాదన్నారు. దీన్ని మర్చిపోయిన అధ్యాయం అనడం సీజేఐ గొప్పతనమని కొనియాడారు. అక్టోబరు 6న ఈ ఘటన చోటుచేసుకుంది. సీజేఐ జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌తో కూడిన ధర్మాసనం కోర్టు నం.1లో వాజ్యాలపై విచారణను కొనసాగిస్తుండగా రాకేశ్ కిశోర్ (71) అనే న్యాయవాది వేదిక వద్దకు వచ్చారు.వెంటనే తన కాలికున్న బూటును తీసి విసరబోతుండగా భద్రతా సిబ్బంది అడ్డుకుని అతనిని బయటకు తరలించారు. ఈసమయంలో ఆ న్యాయవాది.. 'సనాతన ధర్మాన్ని అవమానిస్తే సహించేది లేదు' అని నినదించడం వినిపించింది. దాడి సమయంలో జస్టిస్ గవాయ్ మనోనిబ్బరంతో కనిపించారు. 'ఇలాంటి బెదిరింపులు నా దృష్టిని మళ్లించలేవు. పనితీరును ప్రభావితం చేయలేవు' అని కోర్టు హాలులో ఉన్న న్యాయవాదులతో ఆయన అన్నారు.

## 'వాళ్ల పేర్లు ఉన్నాయనే ఎఫ్ఐఆర్ నమోదు చేయట్లేదు': ఐపీఎస్ అధికారి ఆత్మహత్య కేసులో భార్య ఆరోపణలు

హరియాణాలో సీనియర్ ఐపీఎస్ అధికారి పూరన్ కుమార్ రివాల్వర్‌తో కాల్చుకొని బలవన్మరణానికి పాల్పడిన ఘటన కలకలం సృష్టిస్తోంది. ఆయన సతీమణి సీఎంకు రాసిన లేఖలో సంచలన ఆరోపణలు చేశారు. 8 పేజీల్లో సూసైడ్ నోట్ లభించినా, ఫిర్యాదు చేసినా.. ఎలాంటి ఎఫ్ఐఆర్ నమోదు కాలేదని పేర్కొన్నారు. ఆయన సూసైడ్ నోట్‌లో ఉన్నతాధికారుల వేధింపులు, అవమానాల గురించి పేర్కొన్నప్పటికీ వాటిని చండీగఢ్ పోలీసులు విస్మరించారని ఆరోపించారు. "హరియాణా పోలీస్ విభాగానికి చెందిన ఉన్నతాధికారులు, ఇతర అధికారులు ఈ కేసులో నిందితులుగా ఉండటం, వారు చండీగఢ్ పోలీసుల్ని ప్రభావితం చేయడమే ఎలాంటి చర్యలు తీసుకోకపోవడానికి కారణం" అని ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీకి రాసిన లేఖలో పేర్కొన్నారు. "ఈ ఉన్నతాధికారులు నాతో పాటు నాకుటుంబంపై బురదజల్లే




ప్రయత్నం చేయొచ్చు. శాఖాపరంగా నన్ను ఇరికించే ప్రయత్నాలు చేయొచ్చు. నా భర్త మరణానికి కారణమైన వారినుంచి నాకు బెదిరింపులు ఎదురవుతున్నాయి" అని ఆమె ఆందోళన వ్యక్తంచేశారు. ఈ సమయంలో తన కుటుంబానికి రక్షణ కల్పించాలని కోరారు. ఈ కేసులో వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని, సాక్ష్యాలు తారుమారు కాకుండా, విచారణలో జోక్యం చేసుకోకుండా ఉండేందుకు బాధ్యులను సస్పెండ్ చేయాలని అభ్యర్థించారు. అలాగే చండీగఢ్‌లోని స్టేషన్ హౌస్ ఆఫీసర్‌కు కూడా ఓ లేఖ రాశారు. హరియాణా డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ శత్రుజీత్ సింగ్ కపూర్, ఇతర అధికారులపైనా ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని పేర్కొన్నారు. తన భర్త కులవివక్ష ఎదుర్కొన్నారని వాపోయారు. మంగళవారం చండీగఢ్‌లో తన నివాసంలో పూరన్ ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆయన మృతదేహాన్ని బేస్‌మెంట్‌లో కనుగొన్నారు. ఆయన భార్య అమ్నీత్ పి కుమార్ ఐఏఎస్ అధికారిణి. ఆ సమయంలో ఆమె విదేశీ పర్యటనలో ఉన్నారు. సీఎంతో కలిసి అధికార పర్యటనలో భాగంగా జపాన్ వెళ్లారు. 2001 ఐపీఎస్ బ్యాచ్ హరియాణా క్యాడర్‌కు చెందిన 52 ఏళ్ల పూరన్ కుమార్ స్వరాష్ట్రం ఆంధ్రప్రదేశ్. ఇటీవల ఆయన అధికారుల హక్కుల గురించి మాట్లాడటం చర్చనీయాంశమైంది. ఆ తర్వాత కొన్ని రోజులకే ఆయనను పోలీస్ ట్రైనింగ్ కళాశాల ఐజీగా బదిలీ చేశారు.

## ఏఐను దుర్వినియోగం చేయొద్దు: ఈసీ

బిహార్ శాసనసభ ఎన్నికల కు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఈసీ రాజకీయ పార్టీలకు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికల నేపథ్యంలో డీప్‌ఫేక్‌లను సృష్టించడానికి, తప్పుడు సమాచారం వ్యాప్తి చేసేందుకు కృత్రిమ మేధను దుర్వినియోగం చేయొద్దని హెచ్చరించింది. ఈ మేరకు గురువారం ఈసీ ఓ ప్రకటనను జారీ చేసింది. పార్టీలు ఎన్నికల ప్రచారంలో భాగంగా తమ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో పంచుకునే విషయాలు ఏఐ జనరేటెడ్ లేదా కల్పితమైనవి అయితే ఆ విషయాన్ని కచ్చితంగా స్పష్టంచేయాలని పేర్కొంది. పార్టీలు, స్టార్ క్యాంపెయినర్లు, అభ్యర్థులు ప్రముఖంగా ఈ విషయాన్ని గుర్తించాలని తెలిపింది. ఎన్నికల ప్రక్రియపై ప్రభావం పడకుండా ఉండేందుకు సామాజిక మాధ్యమాల్లోని పోస్టులపై నిఘా ఉంటుందని హెచ్చరించింది. ఎన్నికల ప్రక్రియ సమగ్రతను నిలబెట్టుకోవాల్సిన అవసరం అన్ని పార్టీలకు ఉందని ఈసందర్భంగా నొక్కి చెప్పింది. గత లోక్‌సభ ఎన్నికల సమయంలో కూడా ఈసీ ఇలాంటి ఆదేశాలే జారీ చేసింది. ఇక, బిహార్‌లో నవంబరు 6, 11 తేదీల్లో రెండు దశల్లో ఎన్నికలు జరగనున్నాయి. 14న ఓట్ల లెక్కింపు ఉంటుంది.

## జెండా సంగతేంటి..? అఫ్గాన్ మంత్రి పర్యటన వేళ భారత్ డైలమా

తాలిబన్ ఆక్రమణలో ఉన్న అఫ్గానిస్థాన్ నుంచి విదేశాంగమంత్రి ఆమిర్ ఖాన్ ముత్తాఖీ తొలిసారి భారత్‌లో అడుగుపెట్టారు. వారం రోజులపాటు పలు భేటీల్లో పాల్గొననున్నారు. ఇక్కడే భారత్‌కు ఒక చిక్కొచ్చిపడింది. ఇంతకీ విషయం ఏంటంటే..? భారత్‌కు వచ్చిన అఫ్గాన్ మంత్రి భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్, ఎన్ఎస్ఏ అజిత్ ఢోబాల్‌తో చర్చలు జరపనున్నారు. దౌత్యపరమైన ప్రొటోకాల్ ప్రకారం.. మన త్రివర్ణ పతాకంతో పాటు సందర్శనకు వచ్చిన నేత దేశానికి చెందిన జెండాను వారి వెనక లేక టేబుల్‌పై ఉంచాలి. ఇక్కడే అధికారులు డైలమాలో పడ్డారు. ఆ ప్రభుత్వాన్ని భారత్ గుర్తించలేదు. అలాగే జెండాను కూడా. దిల్లీలోని అఫ్గాన్ రాయబార కార్యాలయంపై తమ జెండాను ఎగురవేయడానికి మన ప్రభుత్వం అనుమతించలేదు. ఇప్పటికీ ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ అఫ్గానిస్థాన్ జెండానే అక్కడ ఎగురుతోంది. ఇటీవల ముత్తాఖీ, భారత అధికారుల మధ్య కాబుల్‌లో సమావేశం జరిగింది. అప్పుడు వెనకవైపు తాలిబన్ జెండాను ఉపయోగించారు. మరోసారి దుబాయ్‌లో విదేశాంగ సెక్రటరీ విక్రమ్ మిస్త్రీ, ముత్తాఖీ భేటీ అయ్యారు. అప్పుడు ఎవరి జెండా పెట్టకుండా చర్చలు జరిపారు. కానీ ఈసారి వేదిక భారత్. ఇది అధికారులకు దౌత్యపరమైన సవాల్‌గా మారింది. ఇప్పుడు అఫ్గాన్‌కు చెందిన పాత, కొత్త జెండాలలో దేనినైనా ఉపయోగిస్తారా..?లేక అసలు జెండాలు లేకుండానే సమావేశాలు నిర్వహిస్తారా..? అన్నది తెలియాల్సి ఉంది. ఇదిలా ఉంటే.. భారత్‌అఫ్గానిస్థాన్ మధ్య సుదీర్ఘకాల స్నేహబంధం ఉంది. అయితే 2021లో తాలిబన్ల ఆక్రమణ తర్వాత కాబుల్‌లో భారత్ తన ఎంబసీని మూసివేసింది. అయితే వైద్య,



మానవతాసహాయం, వాణిజ్యం కోసం ఏడాది తర్వాత ఒక చిన్నపాటి దౌత్యమిషన్‌ను తెరిచింది. అక్కడి ప్రభుత్వాన్ని గుర్తించకపోయినా.. అఫ్గాన్‌లో అధికారంలో ఉన్నవారితో దౌత్య సంబంధాల పునరుద్ధరణకు పలు చర్యలు తీసుకుంటోంది. అలాగే అఫ్గాన్ గడ్డను ఎలాంటి ఉగ్రవాద కార్యకలాపాలకు వినియోగించుకుండా చూడాలని ఐరాస వేదికగా పిలుపునిచ్చింది. ఇటీవల జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని తాలిబన్ ప్రభుత్వం ఖండించిన సంగతి తెలిసిందే.

## కొనుగోళ్ల జోష్..
## నష్టాల నుంచి లాభాల్లోకి స్టాక్ మార్కెట్లు..!



**ముంబై:** దేశీయ స్టాక్ మార్కెట్లు నష్టాలను అధిగమించి.. లాభాల్లోకి దూసుకెళ్లాయి. అన్నిరంగాల్లో కొనుగోళ్లు జరిగాయి. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 81,900 పాయింట్ల వద్ద లాభాల్లో మొదలైంది. ఇంట్రాడేలో 81,667.68 పాయింట్ల కనిష్టానికి చేరిన సెన్సెక్స్.. గరిష్టంగా 82,247.73 పాయింట్లను తాకింది. చివరకు 398.45 పాయింట్ల లాభంతో 82,172.10 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం నిఫ్టీ 135.65 పాయింట్లు పెరిగి 25,181.80 వద్ద స్థిరపడింది. బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.75శాతం పెరగ్గా.. స్మాల్‌క్యాప్ ఇండెక్స్ ఫ్లాట్‌గా ముగిసింది. నిఫ్టీలో అత్యధికంగా లాభపడినవి హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, జెఎస్‌డబ్ల్యూ స్టీల్, టాటా స్టీల్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ లాభపడ్డాయి. టాటా కన్స్యూమర్, యాక్సిస్ బ్యాంక్, మారుతి సుజుకి, టైటాన్ కంపెనీ, భారతి ఎయిర్‌టెల్ నష్టపోయాయి.

సీఈవో రాజీనామాతో ఓస్వాల్ ఆగ్రో మిల్స్ షేర్లు 3శాతం పడిపోయాయి. 1.2 మిలియన్ షేర్ల బ్లాక్ డీల్‌తో టాటా స్టీల్ షేర్లు 52 వారాల గరిష్ట స్థాయికి చేరుకున్నాయి. రూ.144 కోట్ల విజేత ప్రాజెక్ట్‌తో గరుడ కన్స్ట్రక్షన్ షేర్లు 5శాతం పెరిగాయి. రూ.303 కోట్ల విలువైన ఎగుమతి ఆర్డర్‌లతో హెచ్ఎఫ్‌సీఎల్ షేర్లు. రూ.290 కోట్ల ఈపీసీ ప్రాజెక్ట్‌ను దక్కించుకోవడంతో జీఆర్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్ షేర్లు 3.5శాతం వృద్ధిని నమోదు చేశాయి. క్యూ2 ఆదాయం 6.5శాతం పెరిగినప్పటికీ సెంకో గోల్డ్ షేర్లు 4శాతం పతనం కాగా.. ప్రెస్టీజ్ ఎస్టేట్స్ ప్రాజెక్ట్స్ షేర్లు 4శాతం పెరిగాయి. హిందుస్తాన్ కాపర్, టాటా స్టీల్, ఎటర్నల్, ఫోర్టిస్ హెల్త్‌కేర్, ఉషా మార్టిన్, ఆస్టర్ డిఎం హెల్త్‌కేర్, ముత్తూట్ ఫైనాన్స్ వంటి 120 కి పైగా స్టాక్‌లు బీఎస్ఈలో 52 వారాల గరిష్టాన్ని తాకాయి. ఇక రూపాయి ప్రతికూలంగా ట్రేడవుతున్నది. ఆల్ టైమ్ కనిష్ట స్థాయికి చేరింది. యూఎస్ డాలర్‌తో పోలిస్తే 4 పైసలు తగ్గి 88.79 వద్ద ముగిసింది.

## దేశంలో అత్యంత సంపన్న మహిళగా సావిత్రి జిందాల్..

### ఫోర్బ్స్ లిస్ట్‌లో టాప్ 10లో ఉన్న ఏకైక మహిళ



**న్యూఢిల్లీ:** భారత్‌లో అత్యంత సంపన్న మహిళగా మరోసారి ఓపీ జిందాల్ గ్రూపు ఓనర్ సావిత్రి జిందాల్ నిలిచారు. భారత్‌లోని 100 మంది సంపన్నుల జాబితాను ఫోర్బ్స్ తాజాగా విడుదల చేసింది. ఈ జాబితాలో దేశంలోనే అత్యంత సంపన్న మహిళగా సావిత్రి జిందాల్ నిలిచారు. అంతేకాదు, టాప్ 10 భారత బిలియనీర్లలో ఉన్న ఏకైక మహిళ ఆమే కావడం విశేషం. ఫోర్బ్స్ విడుదల చేసిన జాబితాలో ముకేశ్ అంబానీ 105 బిలియన్ డాలర్లతో ఫస్ట్ ప్లేస్‌ను సొంతం చేసుకోగా, 92 బిలియన్ డాలర్లతో గౌతమ్ అదానీ రెండో స్థానంలో నిలిచారు. ఆ తర్వాత సావిత్రి జిందాల్ 40 బిలియన్ డాలర్లతో మూడోస్థానాన్ని కైవసం చేసుకున్నారు. గతేడాదితో పోలిస్తే ఆమె సంపద 3.5 బిలియన్ డాలర్లు తగ్గింది. అయినప్పటికీ భారత్‌లోనే అత్యంత సంపన్న మహిళగా సావిత్రి జిందాల్ కొనసాగుతున్నారు.

భారతదేశంలోని అత్యంత సంపన్న మహిళల జాబితాలో సావిత్రి జిందాల్ పేరు అగ్రస్థానంలో కొనసాగుతున్నారు. సావిత్రి జిందాల్.. ఓపీ జిందాల్ గ్రూపు ఓనర్‌గా ఉన్నారు. జిందాల్ గ్రూప్ భారీ వ్యాపారాన్ని ఆమె నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఆమె హర్యానాలో ఎమ్మెల్యేగానూ కొనసాగుతున్నారు. స్టీల్, పవర్, సిమెట్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రంగాల్లో జిందాల్ గ్రూపు వ్యాపారాలున్నాయి.

ఆ గ్రూపునకు సావిత్రి చైర్మెన్‌గా కొనసాగుతున్నారు. ఆమె భర్త ఓం ప్రకాశ్ జిందాల్ ఆ కంపెనీ స్థాపించారు. 2005లో జరిగిన హెలికాప్టర్ ప్రమాదంలో ఓపీ జిందాల్ ప్రాణాలు కోల్పోయారు. ఆయన మృతి తర్వాత వ్యాపారాన్ని నాలుగురు కుమారులకు విభజించారు. ముంబైలో ఉండే ఆమె కుమారుడు సజ్జన్ జిందాల్ .. జేఎస్‌డబ్ల్యూ స్టీల్, జేఎస్‌డబ్ల్యూ సిమెంట్, జేఎస్‌డబ్ల్యూ పెయింట్స్, జేఎస్‌డబ్ల్యూ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వ్యాపారం చేస్తున్నాడు. ఎంజీ మోటారు ఇండియా ఎలక్ట్రిక్ వాహనాల కంపెనీలో 35 శాతం వాటా తీసుకున్నారు. ఢిల్లీలో నివసించే నవీన్ జిందాల్.. జిందాల్ స్టీల్, పవర్ చూసుకుంటున్నారు.

## టీసీఎస్ లాభం రూ.12,075 కోట్లు..

### ఒక్కో షేరుపై రూ.11 డివిడెండ్




న్యూఢిల్లీ: టాటా గ్రూప్‌నకు చెందిన ఐటీ సేవల సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ రెండో త్రైమాసిక ఫలితాలను ప్రకటించింది. టీసీఎస్ ఫలితాలతో టెక్ కంపెనీల క్యూ2 ఆర్థిక ఫలితాల సీజన్ ప్రారంభమైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జులై- సెప్టెంబర్ త్రైమాసికానికి రూ.12,075 కోట్ల నికర లాభాన్ని కంపెనీ నమోదు చేసింది. గత ఆర్థిక సంవత్సరంలో ఇదే త్రైమాసికంతో పోలిస్తే 1.39 శాతం వృద్ధి నమోదైంది. గతేడాది రెండో త్రైమాసికంలో కంపెనీ రూ.11,909 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది.

నిర్వహణ లాభం 2.39 శాతం పెరిగి 65,799 కోట్లకు చేరింది. గతేడాది ఇదే త్రైమాసికంలో ఆదాయం 64,259 కోట్లు. ఇంతకుముందు త్రైమాసికంతో పోలిస్తే లాభం 5.3 శాతం తగ్గగా.. ఆదాయం 3.7 శాతం పెరిగింది. త్రైమాసిక ఫలితాల సందర్భంగా కంపెనీ ఒక్కో షేరుకు రూ.11 చొప్పున మధ్యంతర డివిడెండ్‌ను ప్రకటించింది. ఫలితాల నేపథ్యంలో గురువారం కంపెనీ షేరు విలువ బీఎస్ఈలో రూ.3,061.95 వద్ద ముగిసింది. అంటే క్రితం ముగింపుతో పోలిస్తే 1.16 శాతం పెరిగింది.



## వన్డేల్లో అత్యధిక రన్స్..

### 'ఆల్‌టైమ్ రికార్డు' నెలకొల్పిన మంధాన

న్యూఢిల్లీ: భీకర ఫామ్‌లో ఉన్న భారత మహిళల జట్టు ఓపెనర్ స్మృతి మంధాన రికార్డుల దుమ్మెదులుపుతోంది. ఇప్పటికే ఏడాదిలో నాలుగు శతకాలతో రికార్డు నెలకొల్పిన ఈ సొగసరి బ్యాటర్.. మరో రికార్డు తన పేరిట రాసుకుంది. ఒకే ఏడాది వన్డేల్లో అత్యధిక పరుగులతో చరిత్ర సృష్టించిందీ డాషింగ్ ఓపెనర్.

స్వదేశలో జరుగుతున్న మహిళల వన్డే వరల్డ్ కప్ రెండు మ్యాచుల్లో విఫలమైన మంధాన.. దక్షిణాఫ్రికాతో మ్యాచ్‌లో ఏడు పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద ఈ ఘనత సాధించింది. ఈ ఏడాది విధ్వంసక బ్యాటింగ్‌తో అలరిస్తున్న మంధాన 972 పరుగులతో ఆస్ట్రేలియా దిగ్గజం బెలిండా క్లార్క్ రికార్డును బద్ధలు కొట్టింది.

వరల్డ్ కప్ ముందు ఆస్ట్రేలియాపై రెండు సెంచరీలతో కదం తొక్కిన మంధాన ఆసీస్ వెటరన్ క్లార్క్ రికార్డుకు దగ్గరైంది. సఫారీలతో మ్యాచ్‌లో ఆమె 1997లో 970 పరుగులతో క్లార్క్ నెలకొల్పిన ఆల్‌టైమ్ రికార్డును బద్ధలు కొట్టింది. ప్రస్తుతానికి వన్డేల్లో ఒక ఏడాదిలో అత్యధిక పరుగుల రాణుల జాబితాలో మంధాన టాప్‌లో కొనసాగుతుండగా.. దక్షిణాఫ్రికా కెప్టెన్ లారా వోల్వార్డ్ 2022లో 882 రన్స్‌తో మూడో స్థానంలో ఉంది. డెబ్బీ హాక్లే (న్యూజిలాండ్) 1997లో 880 రన్స్‌తో నాలుగో స్థానంలో నిలవగా.. 2016 లో ఆ దేశానికే చెందిన అమీ సటెర్‌వైటీ 853 పరుగులతో ఐదో స్థానం దక్కించుకుంది.

## ఆసియా క్రికెట్ చరిత్రలోనే తొలి బౌలర్‌గా రషీద్ ఖాన్ రికార్డు



**న్యూఢిల్లీ:** భారత క్రికెట్ అభిమానులకూ సుపరిచితుడు రషీద్ ఖాన్ అద్భుతమైన ఘనతను తన ఖాతాలో వేసుకున్నాడు. అఫ్ఘానిస్థాన్‌కు చెందిన ఈ బౌలర్ ఆసియా క్రికెట్ చరిత్రలో సూపర్ రికార్డు సాధించాడు. ఇప్పటివరకు ఏ బౌలర్‌కు సాధ్యం కాని ఘనత అది. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో తొలి ఆసియా బౌలర్‌గా నిలిచాడు.

తాజాగా బంగ్లాదేశ్‌తో అఫ్ఘానిస్థాన్ వన్డే సిరీస్ ఆడుతోంది. తొలి వన్డేలో అఫ్ఘాన్ విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో రషీద్ ఖాన్ మూడు వికెట్లు తీశాడు. దీంతో వన్డే ఫార్మాట్‌లో 200ం వికెట్లు తీసిన తొలి అఫ్ఘాన్ బౌలర్‌గా నిలిచాడు. కేవలం 115 మ్యాచుల్లోనే ఈ ఘనత సాధించాడు. అతడి తర్వాత మహ్మద్ నబీ (174 మ్యాచుల్లో 176 వికెట్లు) ఉన్నాడు. ఆసియా క్రికెట్ చరిత్రలో ఇప్పటివరకూ ఎవరూ నమోదుచేయని ఓ ఘనతను రషీద్ సాధించాడు. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో అంటే వన్డేలు, టీ20లు. ఈ ఫార్మాట్లలో 200ం వికెట్లు, 150ం వికెట్లు తీసిన ఏకైక బౌలర్ రషీద్ ఖాన్. ఇటు ఐపీఎల్‌లోనూ 150ం వికెట్లు పడగొట్టడం గమనార్హం. అంతర్జాతీయ టీ20ల్లో 179 వికెట్లు, ఐపీఎల్‌లో 158 వికెట్లు తీశాడు.

బంగ్లాపై అద్భుత విజయం..

అబుదాబీ వేదికగా అఫ్ఘానిస్థాన్ - బంగ్లాదేశ్ జట్ల మధ్య తొలి వన్డే జరిగింది. మొదట బ్యాటింగ్ చేసిన బంగ్లా 48.5 ఓవర్లలో 221 పరుగులకే ఆలౌటైంది. కెప్టెన్ మెహిదీ హసన్ మిరాజ్ (60), తౌహిద్ హృదోయ్ (56) హాఫ్ సెంచరీలు చేశారు. రషీద్ 3, అజ్మతుల్లా 3, ఘజన్‌ఫర్ 2, ఖరోటె 1 వికెట్ తీశారు. అనంతరం లక్ష్య ఛేదనలో ఓపెనర్ రహ్మాతుల్లా గుర్బాజ్ (50), రహ్మత్ షా (50) అర్ధశతకాలతోపాటు అజ్మతుల్లా ఒమర్జాయ్ (40), హష్మతుల్లా షాహిది (33లి) రాణించారు. దీంతో 47.1 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయిన అఫ్ఘాన్ 226 పరుగులు చేసి విజయం సాధించింది. దీంతో మూడు వన్డేల సిరీస్‌లో అఫ్ఘాన్ 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది.

### ఆ అనుభవం మాకు కావాలి..
## రోహిత్‌లా ప్రశాంతంగా ఉంటా: కెప్టెన్ గిల్



**న్యూఢిల్లీ:** భారత క్రికెట్ జట్టు డ్రెస్సింగ్ రూమ్‌లో రోహిత్ శర్మ స్నేహపూర్వక వాతావరణం సృష్టించాడని.. తానూ అదే కొనసాగిస్తానని వన్డే సారథిగా ఎంపికైన శుభ్‌మన్ గిల్ వ్యాఖ్యానించాడు. శుక్రవారం వెస్టిండీస్‌తో రెండో టెస్టు నేపథ్యంలో గిల్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నాడు. ఈ సందర్భంగా వన్డే సారథ్యంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఆస్ట్రేలియాతో అక్టోబర్ 19నుంచి వన్డే సిరీస్ మొదలవనుంది.

"రోహిత్ శర్మ చాలా ప్రశాంతంగా ఉంటాడు. అతడు సారథిగా ఉంటూ జట్టులో నెలకొల్పిన స్నేహపూరిత వాతావరణాన్ని సారథిగా నేనూ కొనసాగిస్తా. చాలామంది బయట నుంచి రకరకాల మాటలు అంటుంటారు. రోహిత్, విరాట్ ప్రస్తుతం వన్డేల్లోనే కొనసాగుతున్నారు. వారిద్దరి భవితవ్యంపై ఊహాగానాలు వస్తున్నాయి. టీమ్‌ఇండియా కోసం ఎన్నో మ్యాచులు గెలిపించారు. వీరిద్దరూ అద్భుతమైన నైపుణ్యం కలిగిన క్రికెటర్లు. జట్టుకు వారు చాలా అవసరం. వచ్చే వన్డే ప్రపంచ కప్ లక్ష్యంగా వారి సన్నద్ధత జరుగుతోంది" అని గిల్ వ్యాఖ్యానించాడు.

ముమ్ముందు మూడు ఫార్మాట్లలోనూ గిల్‌కే సారథ్య బాధ్యతలు దక్కే అవకాశం ఉంది. ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపాడు. "భవిష్యత్తులో ఏం జరుగుతుందో చెప్పలేం. నేను కూడా ఉత్సాహంగా ఎదురుచూస్తున్నా. అయితే, నేనెప్పుడూ వర్తమానంలో ఉండేందుకే ఇష్టపడతా. అలాగే గతంలో ఏం సాధించాననేది అప్రస్తుతం. ప్రతి మ్యాచ్‌లోనూ విజయం సాధించాలనే లక్ష్యంతోనే ముందుకుసాగుతాం. రాబోయే కొన్ని నెలలు మాకు చాలా ముఖ్యం" అని గిల్ తెలిపాడు.

## నవంబర్ 25న వేలం.. ఐదుగురిని మాత్రమే
# అట్టిపెట్టుకునే ఛాన్స్..!

**ముంబై:** మహిళల క్రికెట్‌కు విశేష ఆదరణ కల్పించిన మహిళల ప్రీమియర్ లీగ్ మరో ఎడిషన్‌కు సిద్ధమవుతోంది. గత మూడు సీజన్లు అభిమానులను అలరించిన ఈ మెగా టోర్నీ నాలుగో సీజన్ రాబోతోంది. అంతకంటే ముందుగా వేలం నిర్వహణకు కసరత్తు జరుగుతోంది. నవంబర్ 25 లేదా 29న ఆక్షన్ జరిపేందుకు నిర్వాహకులు సన్నాహకాలు చేస్తున్నారు. ఈ ప్రక్రియలో భాగంగానే ఎంతమందిని అట్టిపెట్టుకోవాలి? రైట్ టు మ్యాచ్? వంటి వాటి గురించి ఫ్రాంచైజీలకు కీలక సూచనలు చేశారు.

డబ్ల్యూపీఎల్ నాలుగో సీజన్ వేలం నేపథ్యంలో ఐదు ఫ్రాంచైజీలకు గురువారం నిర్వాహకులు ఈమెయిల్ పంపించారు. అందులో.. రీటైన్, ఆర్‌టీఎమ్, అన్‌క్యాప్డ్ ప్లేయర్లకు సంబంధించిన విషయాలను స్పష్టంగా పేర్కొన్నారు. ఈసారి ఐదుగురిని మాత్రమే అట్టిపెట్టుకునేందుకు ఫ్రాంచైజీలకు అనుమతిచ్చారు. ఇందులో గరిష్టంగా భారత క్రికెటర్లు ముగ్గురు.. విదేశీయులు ఇద్దరు ఉండాలని సూచించారు. భారత క్రికెటర్లలో ఇద్దరు అన్‌క్యాప్డ్ ప్లేయర్లను రీటైన్ చేసుకునేందుకు ఓకే చెప్పారు. నవంబర్ 5వ తేదీలోపే అన్ని యాజమాన్యాలు తమ రీటైన్ ప్లేయర్ల జాబితాను వెల్లడించాలని తెలిపారు. పేర్ల నమోదుకు నవంబర్ 18 ఆఖరు తేదీ. నవంబర్ 20న వేలంలో నిలిచిన ప్లేయర్ల పేర్లను బీసీసీఐ విడుదల చేయనుందని సమాచారం. ఐపీఎల్ మాదిరిగానే డబ్ల్యూపీఎల్‌లో రైట్ టు మ్యాచ్‌ను అనుమతిస్తూ నిర్వాహకులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఒక ఫ్రాంచైజీ ఐదు ఆర్టీఎమ్‌లో పాల్గొనవచ్చు. ఒకవేళ ఫ్రాంచైజీ నలుగురిని అట్టిపెట్టుకుంటే వాళ్లకు ఒకేఒక ఆర్‌టీఎమ్ ఛాన్స్ ఉంటుంది. అలానే ముగ్గురిని రీటైన్ చేసుకుంటే రెండు ఆర్‌టీఎమ్స్‌లో పాల్గొనవచ్చు. ఇద్దరిని రీటైన్ చేసుకుంటే..మూడు ఆర్‌టీఎమ్స్, ఒక్కరినే అట్టిపెట్టుకుంటే నాలుగు ఆర్‌టీఎమ్స్ లభిస్తాయి.



### 15 కోట్లతో వేలం..

డబ్ల్యూపీఎల్ నాలుగో సీజన్ వేలంలో ఫ్రాంచైజీలు రూ.15 కోట్లు ఖర్చు చేయనున్నాయి. స్లాబ్స్ విషయానికొస్తే.. ఒక క్రికెటర్‌కు మాత్రమే రూ.3.5 కోట్లు చెల్లించే అవకాశముంది. రెండో ప్లేయర్‌కు రూ.2.5 కోట్లు, మూడో ప్లేయర్‌కు రూ.1.75కోట్లు, నాలుగో బ్యాటర్‌కు రూ.1 కోటి.. ఐదుగురు ప్లేయర్లకు రూ.50 లక్షలు వేలం పాట పాడాల్సి ఉంటుంది. ఒక ఫ్రాంచైజీ ఐదుగురిని అట్టిపెట్టుకుంటే వాళ్ల పర్స్ నుంచి రూ.9.75 ను తొలగిస్తారు. ఒకవేళ నలుగురిని రీటైన్ చేసుకుంటే.. రూ.8.75 కోట్లు.. ముగ్గురికి రూ.7.75 కోట్లు, ఇద్దరిని రీటైన్ చేసుకుంటే రూ.6 కోట్లు కట్ చేస్తారు.

మహిళల క్రికెట్ పురోగతి కోసం డబ్ల్యూపీఎల్‌కు శ్రీకారం చుట్టింది బీసీసీఐ. తొలి సీజన్‌లో ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టిన ముంబై ఇండియన్స్ ఛాంపియన్‌గా అవతరించింది. ఫైనల్లో ఢిల్లీ క్యాపిటల్స్‌కు చెక్ పెట్టి విజేతగా కప్‌ను అందుకుంది. రెండో సీజన్‌లోనూ హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని ముంబై తిరుగులుని ఆధిపత్యం చెలాయిస్తూ ట్రోఫీని ఎగరేసుకుపోయింది. అయితే.. మూడో సీజన్‌లో స్మృతి మంధాన కెప్టెన్సీలోని రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఛాంపియన్‌గా నిలిచింది.

# మోహన్ లాల్ చిత్ర రికార్డులు బ్రేక్

## 300 కోట్లు వసూలు చేసిన కొత్తలోక



**టాకీస్:** చిన్న చిత్రంగా విడుదలై రికార్డులు తిరగరాస్తోంది 'కొత్తలోక: చాప్టర్ 1' కేవలం మౌత్ టాక్‌తోనే బాక్సాఫీస్ వద్ద కాసుల వర్షం కురిపిస్తోంది. 300 కోట్ల క్లబ్‌లో చేరినట్లు టాక్. విడుదలైన నెల రోజులకే ఓటీటీకి వచ్చేస్తున్న తరుణంలో 'కొత్తలోక' మాత్రం ఇంకా థియేటర్‌లోనే ప్రేక్షకులను అలరిస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా ఈ మూవీ రూ.300 కోట్ల క్లబ్‌లో చేరింది. అంతేకాదు, అత్యధిక వసూళ్లు రాబట్టిన తొలి మలయాళీ చిత్రంగానూ రికార్డు సృష్టించింది. కల్యాణి ప్రియదర్శన్ కీలక పాత్రలో డొమినిక్ అరుణ్ ఈ చిత్రాన్ని రూపొందించారు. కేవలం రూ.30 కోట్ల బడ్జెట్‌తో రూపొందిన ఈ మూవీ విడుదలైన 40 రోజుల్లో రూ.300 కోట్లు వసూలుచేసినట్లు ట్రేడ్ వర్గాలు అంచనా వేశాయి. మోహన్‌లాల్ కథానాయకుడిగా పృథ్వీరాజ్ సుకుమారన్ దర్శకత్వంలో ఈ ఏడాది వచ్చిన 'ఎల్2: ఎంపురాన్' ఇప్పటివరకూ మలయాళంలో అత్యధిక వసూళ్లు (రూ.265.5 కోట్లు) రాబట్టిన చిత్రంగా ఉండేది. ఆ రికార్డును 'కొత్తలోక' బద్దలు కొట్టింది. వీటి తర్వాత 'తుడురమ్' రూ.242 కోట్లతో మూడో స్థానంలో ఉంది. డొమినిక్ అరుణ్ కథను నమ్మి నటుడు దుల్కర్ సల్మాన్ పెద్ద సాహసం చేశాడు. 'కొత్తలోక' నటీనటులు, సాంకేతిక వర్గంపై రూ.30 కోట్లు ఖర్చు చేయడం చూస్తే, దుల్కర్ ఆ కథను ఎంతగా నమ్మాడో అర్థమవుతుంది. ఆ నమ్మకాన్ని వమ్ము చేయకుండా చిత్రబృందం కష్టపడింది. ఇప్పటివరకూ కల్యాణి ప్రియదర్శన్ నటించిన సినిమాలకు పూర్తి భిన్నంగా కథ, కథనాలు వైవిధ్యంగా ఉండటంతో కేవలం మౌత్ టాక్‌తోనే దూసుకుపోయింది. ఇప్పుడు ఏకంగా మలయాళ సినీ చరిత్రలోనే అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా నిలిచింది. ఇక ఈ చిత్రం ఓటీటీలో ఎప్పుడొస్తుందా? అని సినీ ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. దీపావళి కానుకగా అక్టోబరు 20వ తేదీ నుంచి జియో హాట్‌స్టార్‌లో స్ట్రీమింగ్‌కు తీసుకొచ్చే అవకాశాలున్నాయి. దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. మరోవైపు 'లోక' యూనివర్స్ కొనసాగుతుందని ఇప్పటికే చిత్రబృందం ప్రకటించింది. ఇందులోభాగంగా 'లోక: చాప్టర్2'ను నిర్మాత దుల్కర్ సల్మాన్ ఇటీవల ప్రకటించారు. ఇందులో టొవినో థామస్ కీలక పాత్ర పోషిస్తున్నాడు.

# కవ్విస్తున్న క్యాథరిన్ ట్రెసా..

టాకీస్: హీరోయిన్ క్యాథరిన్ ట్రెసా. తెలుగు ప్రేక్షకులకు సుపరిచితమైన అమ్మాయి. ఇద్దరమ్మాయిలు, సరైనోడు, బింబిసార వంటి చిత్రాల్లో నటించి మెప్పించింది. వరుణ్ సందేశ్ నటించిన చమ్మక్ సినిమాతో తెలుగు తెరకు కథానాయికగా పరిచయమైంది. ఆ తర్వాత అల్లు అర్జున్ సరసన ఇద్దరమ్మాయిలతో సినిమాలో మెరిసింది. తెలుగులో అనేక చిత్రాల్లో నటించినప్పటికీ ఈ బ్యూటీకి మాత్రం క్రేజ్ రాలేదు. ఆ తర్వాత అల్లు అర్జున్ సరసన ఇద్దరమ్మాయిలతో సినిమాలో మెరిసింది. తెలుగులో అనేక చిత్రాల్లో నటించినప్పటికీ ఈ బ్యూటీకి మాత్రం క్రేజ్ రాలేదు. చాలా రోజుల తర్వాత అల్లు అర్జున్ నటించిన సరైనోడు సినిమాతో హిట్ అందుకుంది. ఆతర్వాత మళ్లీ అవకాశాల కోసం ఎదురుచూడాల్సి వచ్చింది. కళ్యాణ్ రామ్ హీరోగా నటించినా బింబిసార సినిమా మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. సినిమాలు వరుసగా హిట్ అవుతున్నప్పటికీ ఈ చిన్నదానికి అనుకున్నంత క్రేజ్ మాత్రం రాలేదు. గత రెండేళ్లుగా సినిమా ఇండస్ట్రీకి దూరంగా ఉంటుంది క్యాథరిన్. చివరగా 2022లో రిలీజ్ అయిన నితిన్ మాచర్ల నియోజకవర్గం చిత్రంలో కనిపించింది. ఇటీవలే తనకు ఉన్న ఓ వింత జబ్బును బయట పెట్టి వార్తల్లో నిలిచింది. ఇక సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉ ండే ఈ అమ్మడు రెగ్యులర్ గా ఫోటోలు, వీడియోలు షేర్ చేస్తూ అభిమానులను ఆకట్టుకుంటుంది. తాజాగా ఈ ముద్దుగుమ్మ పంచుకున్న ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.



MOVIE TIME




# అనుకోకుండానే వచ్చా.. ఇక్కడే నిలిచా: నయనతార

## సినీ రంగంలో 22 ఏళ్లు పూర్తి చేసుకున్న నయనతార

## సోషల్ మీడియాలో భావోద్వేగభరితమైన పోస్ట్

టాకీస్: లేడీ సూపర్‌స్టార్ నయనతార సినీ రంగ ప్రవేశం చేసి 22 సంవత్సరాలు పూర్తయింది. ఈ సుదీర్ఘ ప్రయాణాన్ని గుర్తుచేసుకుంటూ ఆమె సోషల్ మీడియాలో పంచుకున్న ఒక భావోద్వేగభరితమైన పోస్ట్ ఇప్పుడు వైరల్‌గా మారింది. అభిమానులు, సినీ ప్రముఖుల నుంచి ఆమెకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. తొలిసారి కెమెరా ముందుకు వచ్చి 22 ఏళ్లు గడిచిందని నయనతార తన పోస్టులో పేర్కొన్నారు. "అనుకోకుండానే ఇండస్ట్రీలోకి అడుగుపెట్టాను. సినిమాలే నా ప్రపంచం అవుతాయని అస్సలు ఊహించలేదు. కానీ ఇక్కడి ప్రతి షాట్, ప్రతి ఫ్రేమ్ నన్ను నిలబెట్టాయి, ధైర్యాన్ని ఇచ్చాయి. నన్ను నేనేంటో తెలుసుకునేలా చేశాయి" అని ఆమె రాసుకొచ్చారు. ఈ ప్రయాణంలో తనకు అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ ఆమె కృతజ్ఞతలు తెలిపారు. తెలుగులో 'చంద్రముఖి' సినిమాతో పరిచయమైన నయనతార, అతి తక్కువ కాలంలోనే అగ్ర కథానాయికగా ఎదిగారు. బాలకృష్ణ, నాగార్జున, వెంకటేశ్, ప్రభాస్, ఎన్టీఆర్ వంటి స్టార్ హీరోలతో కలిసి నటించి తెలుగు ప్రేక్షకులకు దగ్గరయ్యారు. గతేడాది షారుక్ ఖాన్ సరసన 'జవాన్' సినిమాతో బాలీవుడ్‌లోనూ భారీ విజయాన్ని అందుకుని తన మార్కెట్‌ను పాన్ ఇండియా స్థాయికి విస్తరించుకున్నారు. ప్రస్తుతం నయనతార మెగాస్టార్ చిరంజీవి సరసన ఒక సినిమాలో నటిస్తున్నారు. ప్రముఖ దర్శకుడు అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్న ఈ చిత్రానికి 'మన శంకర వరప్రసాద్ గారు' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ ఫ్యామిలీ, కామెడీ ఎంటర్‌టైనర్‌ను 2026 సంక్రాంతికి విడుదల చేసేందుకు చిత్ర బృందం సన్నాహాలు చేస్తోంది. ఇటీవల ఈ సినిమా నుంచి విడుదలైన 'మీసాల పిల్లా' పాట సోషల్ మీడియాలో, రీల్స్‌లో ట్రెండింగ్‌లో ఉండటం విశేషం.

# త్రివిక్రమ్-వెంకీ కాంబో

## హర్షవర్ధన్ రామేశ్వర్ మ్యూజిక్



**టాకీస్:** నువ్వు నాకు నచ్చావ్ సినిమా తర్వాత వెంకటేశ్ , త్రివిక్రమ్ శ్రీనివాస్ క్రేజీ కాంబోలో ఫుల్ లెంగ్త్ సినిమా రాబోతుందని తెలిసిందే. ఇటీవలే గ్రాండ్‌గా లాంచ్ అయిన ఈ మూవీ త్వరలోనె సెట్స్‌పైకి వెళ్లనుంది. అయితే కొన్నాళ్లుగా సినిమాకు మ్యూజిక్ డైరెక్టర్లుగా రాక్ స్టార్ దేవీ శ్రీ ప్రసాద్, ఎస్ థమన్ పేర్లు ప్రము ఖంగా వినిపిస్తున్నాయి. కానీ త్రివిక్రమ్ మాత్రం ఈ సారి రెగ్యులర్ మ్యూజిక్ కంపోజర్లు కాకుం డా కాస్త రూటు మార్చబోతున్నాడట. ఈ చిత్రం కోసం మ్యూజిక్ లవర్స్‌కు మరింత నయా ఫీల్ అందించేందుకు యానిమల్ కంపోజర్‌ను తెరపైకి తీసుకువచ్చేందుకు ప్లాన్ చేస్తున్నాడని వార్తలు వస్తున్నాయి. తాజా టాక్ ప్రకారం ఈ చిత్రానికి హర్షవర్ధన్ రామేశ్వర్ పేరును పరిగణనలోకి తీసుకుంటున్నాడని ఫిలింనగర్ సర్కిల్ ఇన్‌సైడ్ టాక్. పాన్ ఇండియా మూవీ లవర్స్‌ను ఎంటర్‌టైన్ చేసేలా ఆల్బమ్‌ను ప్లాన్ చేస్తున్నట్టు తాజా వార్తలు హింట్ ఇచ్చేస్తున్నాయి. మరి వెంకీ కోసం హర్షవర్ధన్ రామేశ్వర్ ఎలాంటి బీజీఎం, మ్యూజిక్ ఆల్బమ్ రెడీ చేశాడనేది చూడాలి. ఈ ప్రాజెక్ట్‌లో రుక్మిణి వసంత్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో మెరువబోతుండగా..మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. త్రివిక్రమ్ మరోవైపు అల్లు అర్జున్‌తో మైథలాజికల్ ఫిల్మ్‌ను ప్రకటించిన విషయం తెలిసిందే. అల్లు అర్జున్ స్టార్ డైరెక్టర్ అట్లీ కాంబోలో వచ్చే సినిమా పూర్తయిన తర్వాత త్రివిక్రమ్ సినిమా సెట్స్‌పైకి వెళ్లనుందట.

# అప్పట్లో రామ్‌గోపాల్ వర్మ అంటే ఎవరో తెలీదు

## శివ సినీ పరిశ్రమకు కొత్త దిశను చూపిందన్న శేఖర్ కమ్ముల



**టాకీస్:** ఇండస్ట్రీని 'శివ' సినిమాకు ముందు తర్వాత అని చూడొచ్చని ప్రముఖ దర్శకుడు శేఖర్ కమ్ముల అన్నారు. అగ్ర కథానాయకుడు నాగార్జున హీరోగా రాంగోపాల్ వర్మ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'శివ' మరోసారి అలరించేందుకు సిద్ధమైన విషయం తెలిసందే. నవంబర్ 14న ఈ సినిమా రీరిలీజ్ కానుంది. ఈ నేపథ్యంలో దర్శకుడు శేఖర్ కమ్ముల ఈ సినిమా రోజులను గుర్తుచేసుకున్నారు. అప్పట్లో రామ్ గోపాల్ వర్మ అంటే ఎవరో తనకు తెలియదన్నారు. టాలీవుడ్ చరిత్రలో మలుపుతిప్పిన సినిమాగా గుర్తింపు పొందింది 'శివ'. నాగార్జున హీరోగా, రామ్ గోపాల్ వర్మ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం తెలుగు సినీ పరిశ్రమకు కొత్త దిశను చూపింది. 1989లో విడుదలైన ఈ సినిమా, సాంకేతికంగా, కథా పద్ధతిలో, మేకింగ్‌లో విప్లవాత్మక మార్పులను తెచ్చింది. యాక్షన్ చిత్రాలకే కాదు, కాలేజీ డ్రామాలకు కూడా రియలిస్టిక్ టచ్ ఇచ్చిన మొదటి తెలుగు సినిమా ఇది అని సినీ అభిమానులు ఇప్పటికీ గుర్తు చేసుకుంటారు. ఇప్పుడు ఈ లెజెండరీ సినిమా మళ్లీ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది. నవంబర్ 14న 'శివ' రీ-రిలీజ్ అవుతున్న సందర్భంగా ప్రముఖ దర్శకుడు శేఖర్ కమ్ముల ఈ చిత్రాన్ని గురించి తన భావాలను పంచుకున్నారు. 'అప్పట్లో రామ్ గోపాల్ వర్మ అంటే ఎవరో నాకు తెలియదు. కానీ 'శివ' సినిమా చూశాక సినిమా అంటే ఏమిటో, దాన్ని ఎలా ఆలోచించాలో అర్థమైంది. ఆ సినిమా నా దృష్టి, నా ఆలోచనా విధానాన్ని పూర్తిగా మార్చేసింది' అంటూ కమ్ముల పేర్కొన్నారు. ఆయన చెప్పిన ఈ మాటలు ఆ సినిమాకు ఉన్న ప్రాముఖ్యతను మరోసారి గుర్తు చేస్తున్నాయి. రియలిస్టిక్ సినిమాలకు పేరుగాంచిన శేఖర్ కమ్ముల దృష్టిలో 'శివ' కేవలం ఒక సినిమా కాదు, అది ఒక పాఠశాల లాంటిదట. ఈ సినిమా ప్రభావం తన దర్శకత్వ శైలిలో కూడా కనిపిస్తుందని తెలిపారు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.